విశాఖపట్టణం
ఆదివారం 9 ఆగస్టు 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:197 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# ఏడేళ్లు దాటినా హత్య మిస్టరీ వీడలేదు

### ఆ నాలుగు కీలకాంశాలపై దర్యాప్తు చేయాలి

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వైఎస్ సునీత లేఖ



**(హైదరాబాద్ - జయజయహే)**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు వివేకా కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి సంచలన లేఖ రాశారు. ఏడేళ్లు దాటినా ఈ కేసు మిస్టరీ ఇంకా తేలలేదని పేర్కొన్నారు. 'ఆ నాలుగు కీలక అంశాలపై' దర్యాప్తు జరగాల్సిందేనని ఆమె విజ్ఞప్తి చేశారు. హత్య జరిగి ఏడేళ్లవుతున్నా ఇందుకు సంబంధించిన ఆయుధం ఇంకా దొరకలేదని తెలిపారు. వివేకా ..మిగతా 2లో




# భారత్‌లో ఏఐతో ఉద్యోగాలు పోవు

### జాబ్స్ వచ్చే అవకాశాలు ఎక్కువ

### ఏఐ రంగంలో 83, 100 నియామకాలు

### తొలగించినది కేవలం 83,100 మాత్రమే

### నోమురా ఆర్థికవేత్తల విశ్లేషణలో వెల్లడి

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా ఉద్యోగాలు భారీగా తగ్గిపోతాయని చాలాకాలంగా చర్చ జరుగుతోంది. అయితే తాజా అధ్యయనం ఈ అభిప్రాయానికి భిన్నమైన చిత్రాన్ని చూపిస్తోంది. ప్రపంచంలోని పలు కంపెనీలకు 'బ్యాక్ ఆఫీస్'గా సేవలందిస్తున్న భారత్.. ఏఐ ఉద్యోగాలపై ప్రభావాన్ని అంచనా వేయడానికి కీలకమైన పరీక్షా వేదికగా మారుతోందని నోమురా హోల్డింగ్స్ ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. నోమురా ఆర్థికవేత్తలు సోనల్ వర్మ, సి యింగ్ తోహ్ రూపొందించిన నివేదికలో ఆసియాలో ఏఐ కారణంగా ఏర్పడుతున్న ఉద్యోగాలు, తొలగింపులు, నియామకాల నిలిపివేత వంటి అంశాలను విశ్లేషించారు. 2022 నుంచి 2026 ..మిగతా 2లో

# కుట్రలను తిప్పి కొట్టాలి

### దుష్ప్రచారాన్నిఎండగట్టాలి... వైసీపీ తీరుపై డీఎస్సీ రిక్రూట్ టీచర్లే ఆందోళన



### మంచి పనులు చేస్తే ప్రజలు సహకరిస్తారు

### భోగాపురం ఎయిర్ పోర్టునే నిదర్శనం

### సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

### యూనిట్ ఇన్ చార్జిల శిక్షణ తరగతులకు హాజరు

**(అమరావతి - జయజయహే)**

టీడీపీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇన్‌ఛార్జిలకు శిక్షణా తరగతులను నిర్వహించారు. శిక్షణా తరగతులకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ప్రభుత్వ పథకాలు, పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల్లో నాయకత్వం పెంపొందించడానికే శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకోవాలని.. ప్రభుత్వం చేసే మంచిని ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రభుత్వం చేసిన మంచిని చెప్పుకోకుంటే తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుందన్నారు. చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలని... గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని నిర్దేశించారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని.. దానికి గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగామని సీఎం వెల్లడించారు. డీఎస్సీ పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని చక్కగా చెప్పగలిగామన్నారు. కాబట్టే... గొడ్డలి పార్టీ మినహా కొన్ని పార్టీలకు చెందిన నేతలు ఎలాంటి తప్పులు జరగలేదని బహిరంగంగానే చెబుతున్నారని తెలిపారు. డీఎస్సీ ద్వారా రిక్రూటైన టీచర్లే శనివారం గొడ్డలి పార్టీ తీరును తప్పుపడుతూ ఆందోళన చేపట్టారన్నారు. ప్రభుత్వం చేసే మంచిని ప్రజలకు వివరించగలిగితే... గొడ్డలి పార్టీ కుట్రలను ప్రజలే అడ్డుకుంటారని చెప్పారు. మంచి ..మిగతా 2లో

# నీటి ఎద్దడి నివారణకు జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ

### ట్యాంకర్ల ద్వారా యుద్ధప్రాతిపదికన నీటి సరఫరా

### ముడసర్లోవ మినహా ప్రధాన జలవనరుల పరిస్థితి సంతృప్తికరం

### ఆరిలోవ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా ప్రత్యేక నీటి సరఫరా

### 102 ట్యాంకర్లతో రోజుకు 400 ట్రిప్పుల నిర్వహణ

### ఆరిలోవ, భీమిలి ప్రాంతాలకు అత్యంత ప్రాధాన్యత

### 1కి.మీ. నుంచి 10కి.మీ వరకు నీటి, ట్యాంకర్ ఛార్జీలు ఖరారు

### జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

3



# ఏజెన్సీ బంద్ ప్రశాంతం

### కదంతొక్కిన గిరిజనులు

### జీఓ నెంబర్ 3 పునరుద్ధరణకు డిమాండ్

### 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని పట్టు

2

# తాగిన మైకంలో సూసైడ్ నోట్ రాసా

### ఎక్కడ ఉందో కనపడటం లేదు

### ఎలా బయటకు వచ్చిందో తెలీదు

### పోలీసులకు ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఝలక్

### కస్టడీకి విచారణకు కోరుతూ పిటీషన్

**(హైదరాబాద్ - జయజయహే)**



సంచలనంగా మారిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో రోజుకో కొత్త ట్విస్ట్ వెలుగుచూస్తోంది. తనపై తోటి ట్రైనీ ఆఫీసర్ లైంగిక ఆరోపణలు చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఉదయ్.. కొన్ని రోజుల క్రితం సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్యాయత్నం చేశాడని బాగా ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం ఈ కేసు ..మిగతా 2లో




# యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితమే

### ఎటువంటి చార్జీలు విధించబోం

### ఫోన్ పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

భారతీయ యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు విధించబోమని ఫోన్‌పే సీఈవో సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ లావాదేవీల కోసం వినియోగదారులు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, ఈ సేవలు ఎప్పటికీ ఉచితంగానే కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ లావాదేవీలపై ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007 లోక్‌సభలో ఆమోదం పొందిన తర్వాత డీజిటల్ పేమెంట్లపై ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో నిగమ్ ఈ మేరకు స్పందించారు. మరోవైపు, చిరు వ్యాపారులకు ఉచిత యూపీఐ సేవలు యథావిధిగా ..మిగతా 2లో

### మెడికో ప్రియాంక ఆరోగ్యం

# అత్యంత విషమం

### ఆప్నియా టెస్టుకు సహకరించని శరీరం

### మద్యం మత్తులో కారుతో ఢీకొట్టిన యువకులు



**(రాజమహేంద్రవరం - జయజయహే)**

రాజమహేంద్రవరంలో యువకులు కారుతో ఢీకొట్టిన ఘటనలో బ్రెయిన్ డెడ్ అయిన మెడికో ప్రియాంక ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో వైద్య విద్యార్థి ప్రియాంకకు చికిత్స కొనసాగుతోంది. ప్రియాంకకు ఆప్నియా టెస్ట్ (తీవ్రమైన గాయాలు లేదా కోమాలో ఉన్న రోగికి మెదడు పూర్తిగా పనిచేయడం ఆగిపోయిందో లేదో నిర్ధారించడానికి చేసే పరీక్ష) చేయడానికి వైద్యులు యత్నించినా శరీరం సహకరించకపోవడంతో టెస్ట్‌ను విరమించారు. కిమ్స్ వైద్యులు ప్రియాంక ఆరోగ్యంపై కుటుంబసభ్యులతో చర్చించారు. ఈనెల 3న రాజమహేంద్రవరంలో ప్రియాంకతో పాటు ..మిగతా 2లో



# విశాఖకు వందేభారత్ స్లీపర్

### బెంగళూరు నుంచి రాకపోకలు

### వారంలో ఆరు రోజుల పాటు సర్వీసులు

### ప్రతిపాదనలు సిద్ధం చేసిన సౌత్ కోస్ట్ రైల్వే

### రైల్వే బోర్డు ఆమోదమే తరువాయి

2

# భారత్‌లో ఏఐతో ఉద్యోగాలు పోవు

మొదటి పేజీ తరువాయి...

ఆగస్టు వరకు అందుబాటులో ఉన్న 69 ఉదాహరణలను ఈ అధ్యయనంలో పరిశీలించారు. నివేదిక ప్రకారం, భారత్‌లో ఈ కాలంలో ఏఐకి సంబంధించిన విభాగాల్లో 83,100 మంది నియామకాలు జరిగాయి. అదే సమయంలో ఏఐ ప్రభావంతో ఉద్యోగాలు కోల్పోవడం, ఉద్యోగ విరమణ వంటి వాటి సంఖ్య 31,921గా ఉంది. అంటే ప్రస్తుత దశలో భారత్‌లో ఏఐ కారణంగా కోల్పోతున్న ఉద్యోగాల కంటే, ఏఐ ఆధారంగా ఏర్పడుతున్న కొత్త ఉద్యోగాల సంఖ్య గణనీయంగా ఎక్కువగా ఉంది. నోమురా విశ్లేషణ ప్రకారం.. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో ఎక్కువగా సపోర్ట్ టీమ్‌లకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. చాట్‌బాట్‌లు, ఆటోమేషన్ వంటి టెక్నాలజీలను ఉపయోగించడం ద్వారా ఈ పనులను సంస్థలు తగ్గిస్తున్నాయి. మరోవైపు, ఏఐ పై పెరుగుతున్న డిమాండ్ కారణంగాఐటీ సర్వీసెస్ రంగంలో కొత్తగా ఉద్యోగాలు కల్పిస్తున్నాయి.

**ఫ్రెషర్లకు పోటీ పెరిగే అవకాశం**

ఏఐ ప్రభావంతో ఉద్యోగ మార్కెట్‌లో ఒక కొత్త రకమైన మార్పు కనిపిస్తోందని నోమురా పేర్కొంది. భారత్, కొరియా వంటి దేశాల్లో రెండు స్థాయిల లేబర్ మార్కెట్ ఏర్పడుతున్నట్లు ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ఒకవైపు ఎంట్రీ లెవల్ ఉద్యోగులపై డిమాండ్ తగ్గుతుండగా.. మరోవైపు అనుభవం ఉన్న ఉద్యోగులు, వ్యాపార అవసరాలను లోతుగా అర్థం చేసుకున్న నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ఇది ముఖ్యంగా ఫ్రెషర్లకు కీలకమైన సంకేతంగా చెప్పవచ్చు. కేవలం సాధారణ ఐటీ నైపుణ్యాలు ఉంటే సరిపోకపోవచ్చు. ఏఐ టూల్స్‌తో పనిచేయడం, సమస్యలను పరిష్కరించడం, వ్యాపార అవసరాలను అర్థం చేసుకోవడం వంటి నైపుణ్యాలు భవిష్యత్తులో మరింత కీలకం కావచ్చు. భారత్ మాత్రమే కాదు.. ఆసియా మొత్తం మీద కూడా ఇదే తరహా పరిస్థితి



కనిపిస్తోంది. అధ్యయనం చేసిన కాలంలో ఆసియాలో ఏఐకి సంబంధించిన 1,30,758 ఉద్యోగాలు ఏర్పడ్డాయి. వీటిలో 90 శాతానికి పైగా ఉద్యోగాలు టెక్నాలజీ రంగంలోనే ఉన్నాయి. అదే సమయంలో ఏఐ ప్రభావంతో సుమారు 60,654 ఉద్యోగాలు కోల్పోయినట్లు నివేదిక పేర్కొంది. వీటిలో దాదాపు 60 శాతం ఉద్యోగ నష్టాలు ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలో చోటుచేసుకున్నాయి. భారత్, చైనా వంటి పెద్ద ఆర్థిక వ్యవస్థలతో పాటు ఫిలిప్పీన్స్‌లోనూ ఇదే ధోరణి కనిపిస్తోందని నోమురా తెలిపింది. ముఖ్యంగా బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ రంగంపై ఆధారపడిన దేశాల్లో ఏఐ ప్రభావం వేగంగా కనిపిస్తోంది.

**అయితే అందరికీ సమానంగా ప్రయోజనం ఉండదు**

ఏఐ వల్ల ఉద్యోగాల సంఖ్య మొత్తం మీద పెరుగుతున్నప్పటికీ.. దీనివల్ల ప్రతి ఉద్యోగికి సమానంగా ప్రయోజనం లభిస్తుందని చెప్పలేం. ఏఐ కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన వారు నేరుగా ఏఐ ఇంజినీరింగ్ లేదా ఇతర అధిక నైపుణ్య ఉద్యోగాల్లోకి మారడం చాలా అరుదు. దీంతో ఏఐ ఒకవైపు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తూనే.. మరోవైపు కొన్ని రకాల సంప్రదాయ ఉద్యోగాలకు డిమాండ్‌ను తగ్గించే అవకాశం ఉంది. అందువల్ల భవిష్యత్తులో ఏఐ నైపుణ్యాలు ఉన్నవారు, అనుభవం కలిగిన ఉద్యోగులు, వ్యాపార పరిజ్ఞానం ఉన్న నిపుణులకు ఎక్కువ అవకాశాలు లభించే అవకాశం ఉంది. సాధారణంగా పునరావృతమయ్యే పనులు చేసే ఉద్యోగాలపై మాత్రం ఆటోమేషన్ ప్రభావం ఎక్కువగా ఉండొచ్చు.

**యువత ఏం చేయాలి?**

ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయా? అనే భయంతో కాకుండా.. ఏఐతో కలిసి పనిచేయగల నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం యువతకు ముఖ్యమైన వ్యూహంగా మారుతోంది. ముఖ్యంగా ఐటీ, డేటా అనాలిసిస్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ మార్కెటింగ్, ఫైనాన్స్ వంటి రంగాల్లో ఏఐ టూల్స్‌పై అవగాహన పెంచుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. అదే సమయంలో కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం, క్రిటికల్ థింకింగ్, డొమైన్ నాలెడ్జ్ వంటి మానవ నైపుణ్యాలు కూడా చాలా కీలకం. ఎందుకంటే ఏఐ టూల్‌ను ఉపయోగించడం కంటే.. దాన్ని సరైన సందర్భంలో ఎలా ఉపయోగించాలో అర్థం చేసుకునే నిపుణులకు భవిష్యత్తులో ఎక్కువ విలువ ఉండే అవకాశం ఉంది. మొత్తంగా.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాలను చూస్తే ఏఐ వల్ల ఉద్యోగాలు పూర్తిగా అంతరించిపోతున్నాయనే దానికంటే.. ఉద్యోగాల స్వరూపం మారుతోందనే విషయం స్పష్టమవుతోంది. కొత్త రకాల ఏఐ ఆధారిత ఉద్యోగాలు ఏర్పడుతుండగా, కొన్ని సంప్రదాయ ఉద్యోగాలకు డిమాండ్ తగ్గుతోంది. అయితే నోమురా నివేదికలోని గణాంకాలను ఖచ్చితమైన మొత్తం ఉద్యోగ సంఖ్యలుగా చూడకూడదని ఆర్థికవేత్తలు హెచ్చరించారు. ఆసియా ఉద్యోగ మార్కెట్ విభిన్నంగా ఉండటంతో పాటు, ఈ విశ్లేషణ వార్తా నివేదికల ఆధారంగా రూపొందించబడింది. కాబట్టి ఇవి విస్తృత ధోరణులను సూచించే గణాంకాలుగా చూడాలి.

## మెడికో ప్రియాంక ఆరోగ్యం అత్యంత విషమం

మొదటి పేజీ తరువాయి...

మరో విద్యార్థి ఉన్న బైకును యువకులు కారుతో ఢీకొట్టారు. అనంతరం కారుతో ఎక్కించడంతో వైద్య విద్యార్థి ప్రియాంక తలకు తీవ్రగాయాలు అయ్యాయి. కుమార్తె పరిస్థితిపై ప్రియాంక తండ్రి వెంకటేశ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "మా కుమార్తె బతకాలని అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాం. ఆప్నియా టెస్టుకు సోడియం లెవెల్స్ తక్కువగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. సోడియం లెవెల్స్ 160కి పైగా ఉన్నాయి. కంట్రోల్ కోసం ప్రయత్నిస్తున్నారు. అవయవ దానానికి సంబంధించి మమ్మల్ని ఎవరూ సంప్రదించలేదు. దీనిపై ఇంకా మేం నిర్ణయం తీసుకోలేదు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఫోన్ చేసి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. నా కుమార్తెకు ఇలాంటి గతి పట్టించిన వాళ్లని నడిరోడ్డుపై ఉరితీయాలి. కొద్ది రోజులైతే వైద్యురాలిగా సేవలందించేది. ఐసీయూలో ఇలా ఉండటం మా కుటుంబాన్ని కలిచివేస్తోంది. మా కుటుంబానికి తనే పెద్ద దిక్కుగా ఉండి అన్నీ చూసుకోవాలనుకుంది" అని కంటతడి పెట్టుకున్నారు.

**ఇది జరిగింది..**

రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో ర్యాష్‌గా కారు నడుపుతూ ఇద్దరు పీజీ వైద్య విద్యార్థులను ఇద్దరు యువకులు ఢీకొట్టిన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈనెల 3న నిందితులు ఇద్దరు మద్యం సేవించి ఏవీ రోడ్డులో ఉన్న ప్రసాదిత్యా మాల్‌లో సినిమా చూసేందుకు వెళ్లారు. మద్యం సేవించినందున మాల్ సిబ్బంది వీరిని లోనికి అనుమతించలేదు. ఆ తర్వాత వేగంగా కారులో బయటకు వెళ్తూ గేటు వద్ద స్కూటీని ఢీకొట్టారు. ఆపై రోడ్డుపైకి వెళ్లే క్రమంలో మరోసారి బలంగా ఢీకొట్టి వారి మీద నుంచి కారును పోనిచ్చారు. ఈ ఘటనలో స్కూటీపై వెళ్తున్న ఇద్దరు వైద్య విద్యార్థులు గాయపడ్డారు. ప్రమాద సమయంలో స్కూటర్ వెనుక భాగంలో కూర్చున్న ప్రియాంక అనే విద్యార్థిని తలకు తీవ్ర గాయలయ్యాయి. దీంతో ఆమెను బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు ప్రకటించారు. నిందితులు సురావరపు దస్వంత్ ఏ1గా, ఆంద్రూ జోసఫ్ అడ్వర్డ్స్ ఏ2గా చేర్చి కేసు నమోదు చేశారు. మాల్ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించినందుకు మరో కేసు నమోదు చేసి, పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

## ఏజెన్సీ బంద్ ప్రశాంతం

**కదొంతొక్కిన గిరిజనులు**

**జీఓ నెంబర్ 3 పునరుద్ధరణకు డిమాండ్**

**1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని పట్టు**

**(అల్లూరి జిల్లా - -జయజయహే)**

ఆదివాసీల చట్టాల పరిరక్షణ, జీవో నెంబర్ 3 పునరుద్ధరణే ధ్యేయంగా గిరిజన జేఏసీ, ఆదివాసీ సంఘాలు పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త మన్యం బంద్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్రిక్తంగా కొనసాగుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులో ఉదయం నుంచే నిరసనల పర్వం మొదలైంది. పలు ఆదివాసీ సంఘాల నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌కు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. నిరసనకారులు రోడ్డుకు అడ్డంగా కూర్చోవడంతో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. గిరిజన ఉద్యోగాల్లో 100 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో 3కి ప్రత్యామ్నాయంగా వెంటనే కొత్త జీవో జారీ చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ నెరవేర్చాలని, 1/70 చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీస్ బలగాలు మోహరించాయి. నిరసనకారులను రోడ్డుపై నుంచి అడ్డు తప్పించేందుకు పోలీసులు ప్రయత్నించడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం పోలీసులు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ముందుకెళ్లేలా చేశారు. అయితే, బంద్ కారణంగా ప్రయాణికులు ఎవరూ లేకుండానే బస్సులన్నీ ఖాళీగా వెళ్లాయి. జిల్లాలోని జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, అరకులోయ, డుంబ్రిగూడ, హుకుంపేట మండలాల్లో బంద్ కొనసాగుతోంది. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిర్వాహకులు రోడ్డుపైనే బైఠాయించి బంద్ నిర్వహించారు. ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి. అప్పలనరస, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మన్నపడాల్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సుందర్ రావు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మరోవైపు పోలవరం జిల్లా పరిధిలోని రంపచోడవరంలోనూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో బంద్ కొనసాగుతోంది. ఆదివాసీ చట్టాలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన నేతలు ప్రదర్శనలు నిర్వహించారు. మన్యంలో బంద్ కారణంగా వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. అల్లూరి జిల్లాలో అరణ్యగర్జన పేరుతో గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర వ్యాప్త ఏజెన్సీ బందుకు పిలుపునిచ్చారు. జీవో నెంబర్ 3 పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. నిరసన కారులు ప్రైవేట్ వాహనాలు అడ్డగించేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని చెదరగొట్టి బస్సులను యథావిధిగా పంపిస్తున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సెంటర్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరిస్తున్నారు.

## విశాఖకు వందేభారత్ స్లీపర్

**(విశాఖపట్నం - జయజయహే)**

విశాఖపట్నం, ఐటీ రాజధాని బెంగళూరు మధ్య ప్రయాణించే ప్యాసింజర్లు, ఉద్యోగులకు దక్షిణ తీర రైల్వే తీపి కబురు అందించింది. ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గించేందుకు కొత్తగా 'వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్' రైలును నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు సమగ్ర నివేదికను తుది ఆమోదం కోసం రైల్వే బోర్డుకు పంపింది. ప్రస్తుతం వైజాగ్ -- బెంగళూరు మధ్య నడిచే సాధారణ రైళ్లకు 17 నుంచి 21 గంటల సమయం పడుతోంది. అయితే, ఈ కొత్త వందే భారత్ స్లీపర్ అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం కేవలం 15 గంటల కంటే తక్కువకే తగ్గిపోనుంది. వారంలో ఆరు రోజుల పాటు ఈ సర్వీసును నడపాలని ప్రతిపాదించారు. బెంగళూరులో రాత్రి 8:00 గంటలకు బయలుదేరే రైలు మరుసటి రోజు ఉదయం 10:00 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో వైజాగ్‌లో రాత్రి 8:15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10:00 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైలు గుంటూరు, విజయవాడ, నంద్యాల, ధర్మవరం మీదుగా దాదాపు 1,061 కిలోమీటర్ల మేర సాగనుంది. మార్గమధ్యంలో కృష్ణా కెనాల్ జంక్షన్, దువ్వాడ వంటి కీలక స్టేషన్లలో స్టాప్‌లు ఉంటాయి. సాధారణంగా వందే భారత్ స్లీపర్ రైళ్లు 16 కోచ్‌లతో నడుస్తుండగా, ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల ఏకంగా 20 కోచ్‌ల భారీ రేక్‌తో నడపాలని నిర్ణయించారు. గంటకు 160 కి.మీ గరిష్ట వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉన్నప్పటికీ, ట్రాక్ పరిస్థితుల దృష్ట్యా సగటున 75 కి.మీ వేగంతో నడపనున్నారు. విమాన ప్రయాణానికి ధీటుగా ఉండే ఈ స్లీపర్ రైలు ఐటీ నిపుణులకు, తెలుగు ప్రజలకు ఎంతో ఊరటనివ్వనుంది.




## హక్కుల కోసం గర్జించిన మన్య వాణి!

**కొయ్యూరులో విజయవంతమైన బంద్!**

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్,ఆగస్టు 8**

ఏజెన్సీ ప్రాంతాల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం గిరిజనులు ఒక్కటై గళమెత్తారు. జేఏసీ, గిరిజన సంఘం పిలుపు మేరకు సోమవారం కొయ్యూరు మండల కేంద్రంలోని రాజేంద్రపాలెంలో చేపట్టిన ఏజెన్సీ బంద్ విజయవంతమైంది. గిరిజనుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలనే డిమాండ్‌తో చేపట్టిన ఈ బంద్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... "జీవో నెంబర్ 3 ని" పునరుద్ధరణ చెయ్యాలి లేని పక్షంలో ప్రత్యామ్నాయ "జీవో" తీసుకురావాలని, "1/70 చట్టాన్ని" పూర్తి స్థాయిలో అమలు పరచాలని అన్నారు. బంద్‌కు వైఎస్సార్సీపీ పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.వైఎస్సార్సీపీ నాయకులు గొడ్డేటి మహేష్, పాటి చంద్రశేఖర్, నర్సి కృష్ణ బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొని గిరిజనుల పోరాటానికి సంఘీభావం తెలిపారు.ఏజెన్సీ ప్రాంతాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహించిన బంద్‌లో భాగంగా మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. గిరిజనులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారు."మా హక్కుల కోసం.. మా ప్రాంత భవిష్యత్తు కోసం" అంటూ బంద్‌లో పాల్గొన్న గిరిజనులు తమ డిమాండ్లను బలంగా వినిపించారు. ఏజెన్సీ ప్రాంతాల సమస్యలను పరిష్కరించి, గిరిజనుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నాయకులు పేర్కొన్నారు.బంద్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రశాంత వాతావరణంలో బంద్ ముగిసింది.ఈ కార్యక్రమంలో జేఏసీ కొయ్యూరు మండల అధ్యక్షుడు సురబోయిన అశోక్ లాల్, గిరిజన సంఘం నాయకుడు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.




## కుట్రలను తిప్పి కొట్టాలి

మొదటి పేజీ తరువాయి...

పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనే దానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే నిదర్శనమన్నారు. పారదర్శకంగా వ్యవహరించి.. వాస్తవాలు చెబితే ప్రజలే కుట్రలను ఛేధిస్తారనడానికి కర్నూలులో గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా టీచర్ల ఆందోళనే ఉదాహరణ అని సీఎం తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవలే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చానన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులున్నా... వ్యవస్థలను గాడిలో పెట్టి సంక్షేమం, అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సాధారణ కార్యకర్తకైనా, పార్టీ అగ్రనాయకుడికైనా పార్టీనే సుప్రీం అని అన్నారు. ఏయే నియోజకవర్గాల్లో ఏమేం జరుగుతున్నాయనే అంశాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నానని తెలిపారు. కార్యకర్తలను పట్టించుకోని వారిని.. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో జీరో టాలరెన్స్ అని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదన్నారు. ఏ ఎన్నికలు జరిగినా... ప్రతి బూత్‌లోనూ గడిచిన ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువే రావాలని సూచించారు. ప్రభుత్వ అధికారి, ప్రజాప్రతినిధి, నాయకుడి ప్రవర్తన ఓట్లపై చాలా ప్రభావం చూపుతుందన్నారు. యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, మండల అధ్యక్షులకు గౌరవం దక్కేలా చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## ఏడేళ్లు దాటినా హత్య మిస్టరీ వీడలేదు

మొదటి పేజీ తరువాయి...

హత్య కేసులో సీబీఐ దర్యాప్తుపై సునీతారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.కోట్ల మనీ ట్రయల్, హత్య వెనుక ఉన్న 'పెద్ద కుట్ర' కోణాన్ని పూర్తిగా వెలికితీయాలని రాష్ట్రపతికి సునీతారెడ్డి విన్నవించారు. మరణవార్త బయటకు రాకముందే వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఎలా తెలిసింది? అని ప్రశ్నించారు. సీబీఐ అఫిడవిట్ ఆధారంగా ఈ కేసును విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో ఇంకా ఉన్న 'అస్పష్ట అంశాలపై' విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో గతంలో అప్పీల్ చేశానని ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ - తెలంగాణ సీఎంలు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డిలకు కూడా లేఖ ప్రతులను డాక్టర్ సునీతారెడ్డి పంపించారు.

## యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితమే

మొదటి పేజీ తరువాయి...

అందుబాటులో ఉంటాయని పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ఇప్పటికే స్పష్టం చేసింది. అయితే, యూపీఐ సహా ఇతర నోటిఫై ఎలక్ట్రానిక్ పేమెంట్స్ విధానాల ద్వారా జరిగే చెల్లింపులపై ఛార్జీలు విధించే అవకాశాన్ని ప్రభుత్వానికి కల్పించేలా చట్ట సవరణ బిల్లు రూపొందించారు. అయితే, దీనర్థం వినియోగదారుల నుంచి నేరుగా యూపీఐ లావాదేవీ ఛార్జీలు వసూలు చేస్తారని కాదని పీసీఐ ఇదివరకే తెలిపింది. 2016లో యూపీఐ ప్రారంభమైనప్పటి నుంచి వినియోగదారులకు ఈ సేవలు ఎల్లప్పుడూ ఉచితంగానే అందుతున్నాయని పీసీఐ ఎక్స్ పోస్టులో పేర్కొంది. భవిష్యత్తులోనూ ప్రతి భారతీయుడు ఎలాంటి లావాదేవీ రుసుము లేకుండా తక్షణ డిజిటల్ చెల్లింపులు చేసుకోవచ్చని తెలిపింది. కాగా, రూ.1.5 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ కలిగి ఉండే కార్పొరేట్ సూపర్ మార్కెట్లు, షాపింగ్ మాల్స్, లగ్జరీ హోటళ్ల వంటి వాటిల్లో రూ.2,000 కంటే ఎక్కువ విలువైన చెల్లింపులపైనే ఎండీఆర్ ఛార్జీలు విధించే అవకాశం ఉందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే భవిష్యత్తులో ఇతర లావాదేవీలకూ ఆ ఛార్జీలు వర్తింపజేస్తారన్న భయాలు ప్రజల్లో నెలకొన్న నేపథ్యంలో సీఈవో ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా, యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. యూపీఐ సహా ఇతర నోటిఫైడ్ డిజిటల్ చెల్లింపులపై బ్యాంకులు, సర్వీస్ ప్రొవైడర్లు ఛార్జీలు వసూలు చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించింది. ఇందుకోసం, 2007 నాటి పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టాన్ని సవరించారు. ముఖ్యంగా, యూపీఐ, రూపే డెబిట్ కార్డుతో చేసే డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేటు ఛార్జీలు విధించకుండా ఉన్న నిబంధనను తొలగించారు. దీంతో ఇకపై ఏ డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలు ఉండాలో కేంద్రమే నోటిఫికేషన్ ద్వారా నిర్ణయం తీసుకోనుంది. ఇందుకు సంబంధించి, డిజిటల్ పేమెంట్ వ్యవస్థను నడిపే బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లకు ఆదాయం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం బిల్లులో సవరణలు చేసిందని వర్గాలు తెలిపాయి.

## తాగిన మైకంలో సూసైడ్ నోట్ రాసా

మొదటి పేజీ తరువాయి...

ఈ సూసైడ్ నోట్ చుట్టే తిరుగుతోంది. ఈ నోట్‌ను ఉదయ్ కృష్ణారెడ్డి మాయం చేసినట్టు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. అంతేకాదు, సూసైడ్ నోట్‌లో అన్ని ఆధారాలను ఐఫోన్‌లో పొందుపరిచానని రాసిన ఉదయ్ కృష్ణారెడ్డి.. ఆ ఐఫోన్‌ను కూడా మాయం చేసినట్టు పోలీసులు గుర్తించారు. సూసైడ్ నోట్‌లో రాసిన వివరాల గురించి ప్రశ్నించగా.. తాను తాగిన మైకంలో ఈ నోట్ రాశానని, ఆ నోట్ ఇప్పుడు ఎక్కడ ఉందో తనకు తెలియదని ఉదయ్ చెబుతున్నట్టు పోలీసులు తెలిపారు. అలాగే ఆ నోట్ బయటకు ఎలా వచ్చిందనే దానిపై కూడా ఉదయ్ ఎలాంటి సమాధానం చెప్పలేదని పోలీసులు తెలిపారు. దీంతో మరోసారి ఉదయ్‌ను పోలీస్ కస్టడీకి అనుమతించాలని కోరుతూ ఉప్పర్‌పల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఉదయ్ విచారణకు సహకరించలేదని, అతని నుంచి మరికొన్ని కీలక విషయాలు రాబట్టాల్సి ఉందని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. మొత్తానికి ఇప్పుడు ఈ కేసు వ్యవహారం మొత్తం ఉదయ్ రాసిన ఆ సూసైడ్ నోట్ చుట్టే తిరుగుతోంది. మరో కస్టడీలోనైనా ఉదయ్ నోరు విప్పుతారా లేదా అన్నది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

# నీటి ఎద్దడి నివారణకు జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ

**ట్యాంకర్ల ద్వారా యుద్ధప్రాతిపదికన నీటి సరఫరా**

**ముడసర్లోవ మినహా ప్రధాన జలవనరుల పరిస్థితి సంతృప్తికరం**

**ఆరిలోవ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా ప్రత్యేక నీటి సరఫరా.**

**102 ట్యాంకర్లతో రోజుకు 400 ట్రిప్పుల నిర్వహణ**

**ఆరిలోవ, భీమిలి ప్రాంతాలకు అత్యంత ప్రాధాన్యత.**

**1కి.లీ. నుంచి 10కి.లీ వరకు నీటి, ట్యాంకర్ ఛార్జీలు ఖరారు**

**జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

**(విశాఖపట్నం - జయజయహే)**



నగర ప్రజలకు తాగునీటి విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు 102 ట్యాంకర్ల ద్వారా రోజుకు సుమారు 400 ట్రిప్పులు నిర్వహించి యుద్ధప్రాతిపదికన నీటిని అందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నగరానికి నీటిని అందిస్తున్న ప్రధాన నీటి వనరుల పరిస్థితి అన్ని సంతృప్తికరంగా ఉన్నాయని, వాటిని జీవీఎంసీ నిరంతరం పర్యవేక్షిస్తోందని కమిషనర్ తెలిపారు. ముడసర్లోవ రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటిమట్టం 154.11 అడుగులుగా నమోదైందని, అక్కడి నుంచి 0.50 మీ+ఞ (2.27 మీఞ) నీటి సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు. ముడసర్లోవ పరిసర ప్రాంతాల్లో నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యంగా ఆరిలోవ 11, 12, 13 వార్డులకు అన్ని అందుబాటులో ఉన్న ఫిల్లింగ్ పాయింట్ల నుంచి ట్యాంకర్లను తరలించి నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. భీమిలి ప్రాంతంలోనూ నీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

"డయల్-ఏ-ట్యాంకర్" సేవకు ఆగస్టు 8 సాయంత్రం 6.14 గంటల వరకు 977 అభ్యర్థనలు అందగా, 619 ట్యాంకర్ల డెలివరీ పూర్తయిందని, 50 అభ్యర్థనలు స్పందన లేకపోవడం/రద్దు కారణంగా నిలిచిపోగా, 308 అభ్యర్థనలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

పెండింగ్ అభ్యర్థనలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సాధ్యమైనంత త్వరగా నీటిని ఈ రోజే సరఫరా చేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.

**"ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో ట్యాంకర్ బుకింగ్"**

ప్రజలు జీవీఎంసీ అధికారిక వెబ్‌సైట్ gvmc.gov.inలో లాగిన్ అయి e-Booking → Water Tanker Booking ద్వారా అవసరమైన నీటి పరిమాణం, ప్రాంతం, అవసరానికి సంబంధించిన వివరాలను నమోదు చేసి ట్యాంకర్‌ను బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

అభ్యర్థనను నమోదు చేసిన అనంతరం acknowledgement జనరేట్ అవుతుందని, ఆ తర్వాత My Bookingµµ లో సంబంధిత అభ్యర్థనను ఎంపిక చేసుకొని Make My Payment ద్వారా ఆన్‌లైన్ చెల్లింపు చేయవచ్చని తెలిపారు.

ట్యాంకర్లను First-In, First-Out (FIFO) విధానంలో, ట్యాంకర్ల అందుబాటు, నిర్వహణ అవసరాలకు అనుగుణంగా కేటాయిస్తామని పేర్కొన్నారు.

"నీటి, ట్యాంకర్ ఛార్జీల వివరాలు"

ప్రజలకు పూర్తి పారదర్శకత కల్పిస్తూ నీటి పరిమాణాన్ని బట్టి ఖరారు చేసిన ఛార్జీలు ఈ విధంగా ఉన్నాయని కమిషనర్ తెలిపారు:

1 KL నీరుకు 40 రూపాయలు o డ్రైవర్ చార్జెస్ 350 రూపాయలు = మొత్తం 390 రూపాయలు

2 KL 80 రూపాయలు o డ్రైవర్ చార్జీలు 470 = 550 రూపాయలు

5 KL నీరు 200 రూపాయలు ,డ్రైవర్ చార్జీలు 700 రూపాయలు= 900 రూపాయలు

6 KL నీరు 240 రూపాయలు, డ్రైవర్ చార్జీలు 860 రూపాయలు= 1,100 రూపాయలు

10 KL నీరు 400 రూపాయలు, డ్రైవర్ చార్జీలు 1420 రూపాయలు – 1,820 రూపాయలు

నీటి ఛార్జీని ఖూకు ₹40 చొప్పున బుకింగ్ సమయంలో ఆన్‌లైన్‌లో ముందస్తుగా చెల్లించాలని, మిగిలిన ట్యాంకర్ ఛార్జీని acknowledgement/payment receiptలో సూచించిన మేరకు నీటి డెలివరీ సమయంలో ట్యాంకర్ డ్రైవర్‌కు చెల్లించాలని తెలిపారు.

ప్రజలు తమ సంప్ లేదా వాటర్ ట్యాంక్ నిల్వ సామర్థ్యాన్ని బట్టి మాత్రమే ట్యాంకర్‌ను బుక్ చేసుకోవాలని, ట్యాంకర్ వచ్చే సమయానికి నీటిని నింపుకునే సంప్/ట్యాంక్‌ను సిద్ధంగా ఉంచాలని కోరారు.

"నీటి అవసరాలకు Toll-Free -- COC -- WhatsApp సేవలు"

నీటి అవసరాల కోసం ప్రజలు కింది నంబర్ల ద్వారా జీవీఎంసీని సంప్రదించవచ్చని కమిషనర్ తెలిపారు:

టోల్ ఫ్రీ: 1800 4250 0009

COC Cell & WhatsApp: 9014218870

WhatsApp: 8187897569

Cell: 7386001360

**"కమిషనర్ నిరంతర పర్యవేక్షణ"**

నీటి ఎద్దడి నివారణకు చేపట్టిన ప్రత్యేక కార్యాచరణను కమిషనర్ నిరంతరం గమనిస్తున్నట్లు తెలిపారు. అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, ప్రధాన ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు, నీటి సరఫరా పర్యవేక్షక ఇంజనీర్ పలమరాజు, సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో నీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు నీటి విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన ప్రాంతాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా నీటిని అందించేందుకు జీవీఎంసీ అన్ని చర్యలు చేపడుతోందని కమిషనర్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని, వృథాను నివారిస్తూ జీవీఎంసీకి సహకరించాలని కమిషనర్ కేతన్ గార్గ్ విజ్ఞప్తి చేశారు.




## వైద్యులపై హింసను అరికట్టాలి

**'అభయ దినోత్సవం' అవగాహన ర్యాలీ**

**విశాఖపట్నం: (జయ జయహే)**

వైద్యులు, ఆరోగ్య సేవల సిబ్బందిపై హింసను అరికట్టి వారికి సురక్షితమైన పని వాతావరణం కల్పించాలని విశాఖపట్నం ప్రసూతి, స్త్రీరోగ వైద్యుల సంఘం (ఒజీఎస్‌వీ) పిలుపునిచ్చింది. 'అభయ దినోత్సవం' సందర్భంగా శనివారం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ర్యాలీ గంటపాటు కొనసాగింది. వైద్యులు, ఆరోగ్య సేవల సిబ్బందిపై హింసకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, అదనపు డీఎంఈ, ఒజీఎస్‌వీ అధ్యక్షురాలు డా. కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి, కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) సూపరింటెండెంట్ అతిథులుగా హాజరయ్యారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్‌కు చెందిన అండర్‌గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులతో పాటు వైద్యులు, ఆరోగ్య సేవల సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. వైద్యులు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి, వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఒజీఎస్‌వీ కార్యదర్శి డా. జి. సునంద రాణి, పబ్లిక్ అవేర్‌నెస్ కమిటీ చైర్‌పర్సన్ డా. పి. సుధాపద్మశ్రీ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




## చంద్రబాబు తన నిర్ణయాన్ని విరమించుకోవాలి. భీశెట్టి బాబ్జి

**మద్దతు పలికిన రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు!!**

**విజయనగరం (జయ జయహే)**

విశాఖపట్నం కేంద్రం గా రావలసిన రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు (ఆర్.ఆర్. బి )ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి లో ఏర్పాటు చెయ్యమని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం ఉత్తరాంధ్ర యువత కి అన్యాయం చెయ్యడమేనని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ లోక్ సత్తా ఆధ్వర్యంలో శనివారం గురజాడ పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భీశెట్టి డిమాండ్ చేశారు లేకపోతే ఉత్తరాంధ్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం దూరమౌతుందని అన్నారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పిల్లావిజయ్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం తమకి ఆచ్చర్యం కలిగించిందని ఉత్తరాంధ్ర ప్రజల అభిప్రాయం పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్తామని అన్నారు ఆర్.ఆర్. బి విశాఖ లోనే ఉండాలని అన్నారు, బీజేపీ సీనియర్ నేత కుసుమంచి సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిది కాదని అటువంటి నిర్ణయం వలన యువత తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శరగడ రమేష్ కుమార్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర యువత చంద్రబాబు నాయుడు నిర్ణయం కి వ్యతిరేకం గా ప్రభుత్వం పై వత్తిడి పెంచే కార్యక్రమాలు చెయ్యాలని పిలుపు నిచ్చారు, విశ్రాంత స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కె.ఆర్.డి ప్రసాద్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి కి రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు అత్యంత కీలకమని చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకస్తున్నారని అన్నారు, రౌండ్ టేబిల్ సమావేశానికి హాజరైన యువత ని చూస్తే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై యంతవ్యతిరేకత ఉందొ అర్ధమవుతుందని అంబేద్కర్ రైట్స్ అధినేత డాక్టర్ పాండ్రంకి వెంకటరమణ అన్నారు, ఈ సమావేశంలో జెనసేన నేతలు శ్రీనివాస్ రాజు, డేగల ఈశ్వర్రావు, హ్యూమన్ రైట్స్ సంస్థ అధ్యక్షుడు అచ్చిరెడ్డి,న్యాయా వాధులు పి. అప్పలనాయుడు, మహాలక్ష్మి నాయుడు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎస్. కె. పీర్, ఆర్ కె డిఫెన్స్ అకాడమీ అధినేత శంకర్, చంద్ర శేకర్,సుధా బ్రహ్మ నాయుడు, ఉమామహేశ్వర్రావు, పరమ హంస, దాస్ మాస్టారు,ఈశ్వర ప్రసాద్, కనకాచారి, చిరంజీవి, షేకర్,రమణ, శ్రీను,సత్యం మాస్టారు,సూర్య నారాయణ, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

**మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు డిమాండ్....**

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

డీఎస్సీ వ్యవహారంలో అక్రమాలపై స్వతంత్ర సీబీఐ విచారణ జరపాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిడదవోలు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో ఓవర్‌బ్రిడ్జి వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ డీఎస్సీ వ్యవహారంపై స్వతంత్ర సీబీఐ విచారణ జరిపించాలని, రాజకీయ బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని, నిరుద్యోగులకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అమలు చేయాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత, ఉపాధ్యాయ అభ్యర్థులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. తమ నాలుగు ప్రధాన డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు తెలిపారు.



## కళాకారుల ప్రతిభకు 'అమరావతి చిత్రకళా వీధి': మంత్రి దుర్గేష్

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

గుంటూరులో 'అమరావతి చిత్రకళా వీధి' ఉత్సవం వైభవంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కళాకారుల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ ఉత్సవం లక్ష్యమన్నారు. గతంలో నాలుగు గోడలకే పరిమితమైన కళలను ప్రజల ముందుకు తీసుకొచ్చామని తెలిపారు. ఇకపై ప్రతి ఏటా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 'అమరావతి చిత్రకళా వీధి' నిర్వహిస్తామని చెప్పారు. కళాకారులను ప్రోత్సహించడంతో పాటు సంప్రదాయ కళారూపాలకు మరింత గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థులు, కళాభిమానులు ప్రదర్శనను సందర్శించి కళాకారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంప్రదాయ కళల స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, కళాకారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మూడవరోజు రిలే నిరాహార దీక్ష

**డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు ఎం పి గురుమూర్తి.**

**శ్రీకాళహస్తి, ఆగస్టు 08,జయ జయహే**

.శ్రీకాళహస్తిలో వైకాపా ఆధ్వర్యంలో మూడవరోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. దీక్ష లో ఎం పి గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. స్పోర్ట్స్ కోటా పేరిట అర్హత లేని టీడీపీ కార్యకర్తలకు డీఎస్సీ ఉద్యోగాలు కట్టబెట్టారన్నారు. అర్హత లేని వారిని టీచర్లుగా నియమిస్తే విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. డీఎస్సీ నియామక అక్రమాలపై తక్షణమే సిబిఐ విచారణ జరిపించాలని డిమేండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన రిలే నిరాహార దీక్ష లో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరూ తారక శ్రీనివాసులు,ఉ



మ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నవాసుదేవ నాయుడు,ఎంపీపీ నిర్మలమ్మ,జెడ్పిటిసి సంధ్య,రత్నం రెడ్డి,శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు గంగారి రమేష్, అత్తూరూ హరి ప్రసాద్ రెడ్డి,పగడాల రాజు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ భాష,రేణిగుంట టౌన్ ప్రెసిడెంట్ ప్రభాకర్,ఏర్పేడు ఇన్చార్జి గున్నేరి కిషోర్ రెడ్డి,మండల ప్రెసిడెంట్ రమణయ్య యదవ్, తొట్టంబేడు మండల ప్రెసిడెంట్ డా.కోగల సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ నగేష్,కోవి చంద్రయ్య నాయుడు, కొత్తపాటి శ్రీనివాసులు రెడ్డి, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ పఠాన్ ఫరీడ్, గోరా, విద్యార్ధి విభాగ అధ్యక్షులు బంగారు దిలీప్, యువత విభాగ అధ్యక్షులు సూర సురేష్, శ్రీకాళహస్తి మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరులు నాయుడు, ముని కృష్ణ రెడ్డి, చింత రాజేంద్ర పసల కృష్ణయ్య,ఖదీర్, షబ్బీర్,అస్సన్,నాగరాజు రెడ్డి,మున్నా రాయల్, బులెట్ జయశ్యాం రాయల్, ప్రకాశం పంతులు, ఉత్తరాజి శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్,సుమతమ్మ, సాగీరా బీ, షర్మిల ఠాగూర్, సునీత సింగ్,మాధవి,పర్వీన్, రాజ్యలక్ష్మి,భారతమ్మ, బుజ్జమ్మ,సాయి లత,చెంచయ్య నాయుడు, ఆర్కార్డు ముత్తు పులి రామచంద్ర, గఫూర్,ఫజల్,జనార్దన్ యాదవ్, కామి వెంకటేశ్వరలు, సెన్నీరు కుప్పం శేఖర్, ఆశ కిరణ్,పసల సురేష్, మల్బీ మొదలియర్, నాగరాజు రెడ్డి, దయాకర్ రెడ్డి యోగేశ్వర్ రెడ్డి రామచంద్రయ్య, దూదేకుల ప్రెసిడెంట్ బాబు,అట్లా రమేష్,రమణ మాధవి, మణికంఠ, షరీఫ్, చిత్తూర్ బాబూ దుదేకుల, సాదిక్, కొండయ్య, శివతదితర నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## రావిమేట్లలో బూరుగుపల్లి శేషారావు ఇంటింటా ప్రచారం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు మండలం రావిమేట్ల గ్రామంలో 'రెండేళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధి' కార్యక్రమంలో భాగంగా బూరుగుపల్లి శేషారావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల, గ్రామ, వార్డు అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాలపై కేరళ పోరాటం.. దేశానికి ఆదర్శం కావాలి

(హెచ్.ప్రతాప్)

యువశక్తి ఏ దేశానికైనా అతిపెద్ద సంపద. అలాంటి యువత మాదకద్రవ్యాల బారిన పడితే కుటుంబాలు, సమాజం, ఆర్థిక వ్యవస్థ, దేశ భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటాయి. ఇటీవల కేరళ ప్రభుత్వం మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన సమగ్ర చర్యలు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈ నమూనాను ఇతర రాష్ట్రాలు కూడా అధ్యయనం చేసి అమలు చేయాల్సిన అవసరం ఉంది.

భారతదేశం కూడా ఈ సమస్య నుంచి మినహాయింపు కాదు. సామాజిక న్యాయ మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సర్వే (ూ××మీా, 2019) ప్రకారం దేశంలో సుమారు 2.3 కోట్ల మంది ఓపియాయిడ్ వాడకం, 3.1 కోట్ల మంది గంజాయి సంబంధిత పదార్థాల వినియోగం చేస్తున్నారు. ఓపియాయిడ్ వినియోగదారుల్లో సుమారు 77 లక్షల మందికి చికిత్స మరియు పునరావాస సేవలు అవసరం అని నివేదిక పేర్కొంది. ఈ గణాంకాలు సమస్య తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

గత కొన్నేళ్లుగా కేరళలో సింథటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల వినియోగం ఆందోళనకరంగా పెరిగింది. డిజిటల్ సాంకేతికత, సోషల్ మీడియా, ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ వేదికలను ఉపయోగిస్తూ అంతర్రాష్ట్ర ముఠాలు యువతను లక్ష్యంగా చేసుకోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. 2021లో నమోదైన ఎన్‌డీపీఎస్ (చీణూూ) కేసులు 5,695 ఉండగా, 2022లో అవి 26,619కు పెరిగాయి. 2025 నాటికి ఈ సంఖ్య 36,314కు చేరడం సమస్య తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. వాణిజ్య పరిమాణాల్లో మాదకద్రవ్యాల స్వాధీనం కూడా గణనీయంగా పెరిగింది.

ఈ సవాలును ఎదుర్కొనేందుకు కేరళ ప్రభుత్వం ప్రారంభించిన "ఆపరేషన్ తూఫాన్" ప్రశంసనీయమైన చర్య. రాష్ట్ర పోలీసులతో పాటు పొరుగు రాష్ట్రాల పోలీసు బలగాలు, కేంద్ర సంస్థలు, ఎక్సైజ్, విద్య, ఆరోగ్య శాఖలు కలిసి సమన్వయంతో పనిచేయడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. అమలు ప్రారంభమైన కొద్ది వారాల్లోనే వేలాది కేసులు నమోదు కావడం, 7,600 మందికిపైగా డ్రగ్ పెడ్లర్లను అరెస్టు చేయడం, సింథటిక్ డ్రగ్స్‌ను భారీగా స్వాధీనం చేసుకోవడం ఈ కార్యాచరణ ప్రభావాన్ని తెలియజేస్తోంది.

అంతేకాకుండా, ఈ కార్యక్రమం కేవలం అరెస్టులతో పరిమితం కాలేదు. ప్రజల భాగస్వామ్యం, బాధితుల పునరావాసం, వేగవంతమైన విచారణ, సైబర్ ఫోరెన్సిక్ సామర్థ్యాల బలోపేతం, రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడి వంటి అంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వడం దీని విశిష్టత. మాదకద్రవ్యాల అక్రమ రవాణా అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి సమగ్ర వ్యూహమే సమర్థవంతమైన పరిష్కారం.

మాదకద్రవ్యాలపై పోరాటం కేవలం పోలీసుల బాధ్యత కాదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వైద్య నిపుణులు, మీడియా కలిసి యువతలో అవగాహన పెంచాలి. పాఠశాలలు, కళాశాలల్లో జీవన నైపుణ్యాల విద్య, కౌన్సెలింగ్, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. డ్రగ్స్ బారిన పడిన వారిని నేరస్థులుగా కాకుండా చికిత్స అవసరమైన వ్యక్తులుగా చూడడం కూడా అంతే ముఖ్యం.

కేరళ చూపిస్తున్న మార్గం దేశానికి ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది. మాదకద్రవ్యాలపై విజయం సాధించాలంటే కఠిన చట్ట అమలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రాష్ట్రాల మధ్య సమన్వయం, ప్రజల భాగస్వామ్యం, సమర్థవంతమైన పునరావాస వ్యవస్థ---ఈ ఐదు స్తంభాలు తప్పనిసరి. యువతను రక్షించడం అంటే దేశ భవిష్యత్తును రక్షించినట్టే. అందుకే కేరళ నమూనాను అధ్యయనం చేసి, స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రతి రాష్ట్రం అమలు చేయడం కాలానుగుణ అవసరం.

# సుమంత్రుడు-జ్ఞానం, వినయం, సేవాస్ఫూర్తి

## రామాయణంలో ఒక ఆదర్శ సేవకుడు




రామాయణంలోని పాత్రలు కేవలం పురాణగాథలోని వ్యక్తులు మాత్రమే కాదు; అవి నేటి జీవితానికి కూడా విలువైన మార్గదర్శకాలు. అలాంటి పాత్రల్లో సుమంత్రుడు ఒకరు. సాధారణంగా ఆయనను దశరథ మహారాజు రథసారథిగా మాత్రమే గుర్తిస్తాం. అయితే సుమంత్రుడి వ్యక్తిత్వాన్ని లోతుగా పరిశీలిస్తే ఆయన ఒక నిబద్ధత కలిగిన సేవకుడు, అనుభవజ్ఞుడైన సలహాదారు, వివేకవంతుడు, వినయశీలుడు అని తెలుస్తుంది.

దశరథునికి సన్నిహితుడిగా రాజకార్యాలను నిర్వహించడంలో తన అనుభవాన్ని వినియోగించిన సుమంత్రుడు, అవసరమైన సందర్భాల్లో ధర్మబద్ధమైన సలహాలను అందించాడు. ఆయన జీవితంలో విశ్వాసం, వినయం, అనుభవం, కర్తవ్యనిబద్ధత ప్రధానమైన విలువలుగా కనిపిస్తాయి.

### రాజుకు రథసారథి మాత్రమే కాదు

సుమంత్రుడి పాత్రను కేవలం రథాన్ని నడిపే వ్యక్తిగా పరిమితం చేయడం సముచితం కాదు. ఆయన దశరథుని విశ్వసనీయుడిగా, రాజ్యపాలనలో అనుభవజ్ఞుడైన వ్యక్తిగా, అవసరమైనప్పుడు సలహా ఇచ్చే వివేకవంతుడిగా నిలిచాడు.

ఒక రాజుకు సమీపంగా ఉండే వ్యక్తి కేవలం ఆజ్ఞలను పాటించేవాడిగా కాకుండా, సరైన సమయంలో సరైన మాట చెప్పగలిగినవాడిగా ఉండాలి. సుమంత్రుడు ఈ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాడు. ఆయనకు ఉన్న జ్ఞానం పదవిగర్వానికి దారితీయలేదు; అది సేవకు మార్గమైంది.

### శ్రీరాముడి అరణ్యప్రయాణంలో సుమంత్రుడి సేవ

శ్రీరాముడు అరణ్యవాసానికి బయలుదేరిన సందర్భం సుమంత్రుడి వ్యక్తిత్వాన్ని అత్యంత స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. దశరథుని ఆజ్ఞ మేరకు సుమంత్రుడు శ్రీరాముడు, సీత, లక్ష్మణులను రథంలో తీసుకువెళ్లాడు. తనకు అత్యంత ప్రీతిపాత్రుడైన శ్రీరాముడు రాజభవనాన్ని విడిచి అడవులకు వెళ్తున్నాడనే బాధ అతనిలో ఉన్నప్పటికీ, కర్తవ్యాన్ని మాత్రం విడిచిపెట్టలేదు.

శ్రీరాముడిని అడవిలో దింపే సమయం వచ్చినప్పుడు సుమంత్రుడి హృదయం దుఃఖంతో నిండిపోయింది. అయినప్పటికీ భావోద్వేగాలకు లోనై తన బాధ్యతను విస్మరించలేదు. ఇక్కడే ఆయన వ్యక్తిత్వంలోని గొప్పతనం కనిపిస్తుంది---బాధ్యతను నిర్వర్తిస్తూనే భావోద్వేగాలను నియంత్రించుకోవడం.

### విశ్వాసం అంటే అంధ విధేయత కాదు

సుమంత్రుడి నుంచి ఆధునిక సమాజం నేర్చుకోవాల్సిన ముఖ్యమైన పాఠం విశ్వాసానికి ఉన్న అసలైన అర్థం. విశ్వాసం అంటే యజమాని చెప్పిన ప్రతి మాటను ఆలోచన లేకుండా అనుసరించడం కాదు. నిజమైన విశ్వాసం అంటే ధర్మం, న్యాయం, సత్యం ఆధారంగా బాధ్యతను నిర్వర్తించడం.

దశరథుని పట్ల సుమంత్రుడికి అపారమైన నిబద్ధత ఉన్నప్పటికీ, ఆయన పాత్ర కేవలం విధేయ సేవకుడి పాత్ర కాదు. అవసరమైనప్పుడు వివేకంతో ఆలోచించి, ధర్మబద్ధమైన దృక్పథాన్ని ప్రదర్శించాడు. అందువల్ల సుమంత్రుడి విశ్వాసం వ్యక్తిపట్ల మాత్రమే కాకుండా ధర్మం పట్ల కూడా ఉన్న విశ్వాసం.

### వినయం -- గొప్పతనానికి నిజమైన గుర్తింపు

సుమంత్రుడి మరో విశిష్ట లక్షణం వినయం. రాజుకు అత్యంత సన్నిహితుడైనప్పటికీ, తన స్థానాన్ని ప్రదర్శించడానికి ఆయన ఎప్పుడూ ప్రయత్నించలేదు. తన అనుభవాన్ని, పరిజ్ఞానాన్ని గర్వానికి ఉపయోగించకుండా రాజ్యసేవకు వినియోగించాడు.

నేటి సమాజంలో హోదా, అధికారం, సంపద, పరిచయాల ఆధారంగా గొప్పతనాన్ని కొలిచే పరిస్థితి కనిపిస్తోంది. అయితే సుమంత్రుడు మనకు భిన్నమైన ప్రమాణాన్ని చూపిస్తాడు. వ్యక్తి స్థానం ఎంత గొప్పదన్నది కాదు; ఆ స్థానంలో అతను ఎంత నిబద్ధతతో పనిచేస్తున్నాడన్నదే అసలైన విలువ .

### జ్ఞానం సేవగా మారినప్పుడు

జ్ఞానం వ్యక్తిగత గర్వానికి కారణమైతే దాని ప్రయోజనం పరిమితమవుతుంది. అదే జ్ఞానం సమాజానికి, సంస్థకు, కుటుంబానికి ఉపయోగపడితే అది నిజమైన జ్ఞానంగా మారుతుంది. సుమంత్రుడి జీవితం ఈ సత్యానికి ఉదాహరణ.

రాజకార్యాలపై తనకు ఉన్న అనుభవాన్ని ఆయన స్వప్రయోజనాల కోసం ఉపయోగించలేదు. రాజుకు అవసరమైన సమయంలో సలహా ఇవ్వడం, కష్టకాలంలో ధైర్యం చెప్పడం, అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించడం ద్వారా తన జ్ఞానాన్ని సేవగా మార్చుకున్నాడు.

### భావోద్వేగం--కర్తవ్య సమతుల్యత

సుమంత్రుడి పాత్రలో మనసును కదిలించే అంశం ఆయనలోని భావోద్వేగం. శ్రీరాముడితో ఆయనకు ఉన్న అనుబంధం ఎంతో లోతైనది. శ్రీరాముడు అరణ్యానికి వెళున్నప్పుడు ఆయన కూడా తీవ్రంగా బాధపడ్డాడు. అయితే వ్యక్తిగత దుఃఖం తన కర్తవ్యానికి అడ్డంకిగా మారనివ్వలేదు .

ఇది నేటి జీవితంలో కూడా ఎంతో ముఖ్యమైన పాఠం. ఉద్యోగంలోనైనా, కుటుంబంలోనైనా, ప్రజాసేవలోనైనా మనకు భావోద్వేగాలు సహజం. కానీ బాధ్యత ఉన్న చోట భావోద్వేగాలను వివేకంతో సమతుల్యం చేయగలగాలి. కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ మానవత్వాన్ని కోల్పోకపోవడం సుమంత్రుడి ప్రత్యేకత.

### నేటి నాయకత్వానికి సుమంత్రుడి సందేశం

ఆధునిక రాజకీయాలు, పరిపాలన, విద్యా సంస్థలు, కార్పొరేట్ వ్యవస్థలు---ప్రతి రంగంలోనూ మంచి నాయకుడితో పాటు మంచి సలహాదారులు అవసరం. నాయకుడి నిర్ణయాలను కేవలం సమర్థించే వ్యక్తులు కాకుండా, అవసరమైనప్పుడు నిజాన్ని చెప్పగలిగే వ్యక్తులు వ్యవస్థకు బలాన్ని ఇస్తారు.

ఈ దృష్టిలో సుమంత్రుడు ఒక నైతిక సలహాదారుడి ఆదర్శం. నాయకుడి పట్ల విధేయతతో పాటు సత్యం పట్ల నిబద్ధత కలిగి ఉండటం ఆయన నుంచి నేర్చుకోవాల్సిన అంశం.

### చిన్న పాత్ర -- గొప్ప ప్రభావం

సమాజంలో ప్రతి ఒక్కరికీ పెద్ద పదవి లేదా అధికారం ఉండకపోవచ్చు. కానీ తనకు అప్పగించిన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించే వ్యక్తి సమాజంపై గొప్ప ప్రభావాన్ని చూపగలడు.

ఉపాధ్యాయుడు విద్యార్థి జీవితాన్ని మార్చగలడు. వైద్యుడు రోగికి ఆశను అందించగలడు. ఉద్యోగి సంస్థ అభివృద్ధికి తోడ్పడగలడు. ప్రజాసేవకుడు సమాజానికి న్యాయం అందించగలడు. కాబట్టి పాత్ర చిన్నదా, పెద్దదా అన్నది ముఖ్యం కాదు; ఆ పాత్రను ఎంత నిబద్ధతతో పోషిస్తున్నామన్నదే ముఖ్యం.

### సేవలోనే సార్థకత

సుమంత్రుడి జీవితం మనకు సేవ యొక్క అసలైన అర్థాన్ని తెలియజేస్తుంది. సేవ అంటే కేవలం ఆజ్ఞలను పాటించడం కాదు; జ్ఞానంతో, వివేకంతో, వినయంతో, నిబద్ధతతో బాధ్యతను నిర్వర్తించడం .

నేటి ప్రపంచంలో పదవులు మారవచ్చు, అధికారాలు మారవచ్చు, పరిస్థితులు మారవచ్చు. కానీ నిజాయితీతో కూడిన సేవకు విలువ ఎప్పటికీ తగ్గదు. సుమంత్రుడు ఈ శాశ్వత సత్యానికి ప్రతీక.

### శాశ్వత స్ఫూర్తి

సుమంత్రుడి వ్యక్తిత్వాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే---జ్ఞానంతో కూడిన సేవ, వినయంతో కూడిన విశ్వాసం, ధర్మంతో కూడిన కర్తవ్యనిబద్ధత.

రామాయణంలోని ఆయన పాత్ర నేటి మనిషికి ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది: హోదా మనిషిని గొప్పవాడిని చేయదు; హోదాలో ఉన్నప్పుడు అతను చూపించే నైతికత, సేవాస్ఫూర్తి, బాధ్యతే అతని గొప్పతనాన్ని నిర్ణయిస్తాయి.

### ముగింపు

అందుకే సుమంత్రుడు కేవలం రామాయణంలోని రథసారథి కాదు. ఆయన నమ్మకమైన సహచరుడు, వివేకవంతుడైన సలహాదారు, నిస్వార్థ సేవకుడు, వినయానికి ప్రతీక.

" సేవ చిన్నది కాదు; సేవలోని సత్యం, నిబద్ధత, నిస్వార్థతలే దానిని మహత్తరంగా మారుస్తాయి ."

సుమంత్రుడి జీవితం నేటి తరానికి అందించే శాశ్వత సందేశం ఇదే.



ప్రొఫెసర్
విశ్వేశ్వర రావు
చెనమల్లు

# విశ్వ గురువు.. విశ్వమానవ గోత్రీయుడు రవీంద్రనాథ్ ఠాగూర్

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 7 మే 1861న కోల్‌కతాలోని జోరాసాంకోబిలో శారదాదేవి మరియు దేవేంద్రనాథ్ ఠాగూర్ దంపతులకు జన్మించారు. వారిది బెంగాల్ పునరుజ్జీవనానికి, కళలకు, సాహిత్యానికి ప్రసిద్ధి చెందిన జోరాసాంకో ఠాగూర్ కుటుంబం. తండ్రి దేవేంద్రనాథ్ ఠాగూర్ ప్రముఖ బ్రహ్మసమాజ నాయకుడు, గొప్ప తత్వవేత్త, సంఘ సంస్కర్త.

సాహిత్య సాగరంలో రవేంద్ర నాథ్ రచనలు మేలిమి ముత్యాలుగా భావితరాలు ఏరుకొని భవిష్యత్తు ప్రణాళికలు వేసుకోవలసిందే...

సాహిత్యంలోని ప్రతి ప్రక్రియను పలకరించిన రవీంద్రనాథ్ ఠాగూర్ రవి కిరణమై మెరిశాడు అంటే అతిశయోక్తి కాదు.

2000 కి పైగా రాసిన భక్తి పాటలు, దేశభక్తి గేయాలు... కబూలీవాలా, పోస్ట్‌మాస్టర్, నష్టనీర్ వంటి కథలు.. గోరా, ఘరే బైరే, చోఖేర్ బాలి వంటి ప్రసిద్ధ నవలలు... రక్త కరబీ, డాక్ ఘర్ వంటి నాటకాలు ఈయన కలం నుండి జాలువారాయి. అంతేనా! ఇవన్నీ ఒక ఎత్తు అయితే

60 ఏళ్ళ వయసులో కూడా చిత్రలేఖనం కోసం కుంచెను రంగుల్లో ముంచి 2000 పైగా చిత్రాలు గీశారు. విద్య నేర్చుకోవడానికి ముసలితనం అడ్డుకాదు అని ఆచరణలో చూపించారు.

ఠాగూర్ కవి, సంగీతకారుడు, చిత్రకారుడు, సాహిత్యకారుడు, గురువు మాత్రమే కాదు గొప్ప విద్యావేత్త కూడా... 1901లో బెంగాల్‌లో శాంతినికేతన్ పేరుతో వెలుగొందుతున్న ఒక ఆశ్రమ పాఠశాలను స్థాపించారు. ఇప్పుడు అది విశ్వభారతి విశ్వవిద్యాలయంగా విశ్వవ్యాప్తం అయింది.

ఆయన కమనీయ కవిత్వం గీతాంజలి ఈనాటికీ నిత్యయవ్వనం. దానికే 1913లో నోబెల్ బహుమతి వరించింది. దానికి కారణం

ఠాగూర్ రచనా ప్రస్థానంలో ఆయన రాసిన గీతాంజలి 1910లో బెంగాలీలో 157 పాటల సంకలనంగా వచ్చింది. దాన్ని ఆయన 1912లో ఆంగ్లంలో అనువదించి విశ్వవ్యాప్తం చేశారు.

దానిలో ఆయన ఆలోచన, ఆదర్శానికి అక్షర రూపంతో గీత బోధన చేశారు. దాని సారాంశం:

భారతదేశంలోని అన్ని ప్రాంతాలు, మతాలు, భాషల ప్రజలు ఐక్యత కోసం దేవుడు మనల్ని నడిపిస్తున్నాడు అని చెప్పడమే ఠాగూర్ ఉద్దేశం.



గీతాంజలిలోని ముఖ్యమైన 35వ పంక్తి »»where the mind is without fear and the head is held high... ఈ పద్యం ఈరోజుకూ స్వేచ్ఛకు గుర్తు...

భయం లేని మనస్సు, గర్వంగా ఎత్తైన తలతో ఉన్న చోట
జ్ఞానం అందరికీ స్వేచ్ఛగా అందుబాటులో ఉన్న చోట
కులం, మతం, దేశం, భాష అనే ఇరుకైన గోడలతో ప్రపంచం ముక్కలు కాకుండా ఉన్న చోట
ఓ దేవుడా, అలాంటి స్వేచ్ఛా స్వర్గంలో నా దేశాన్ని మేల్కొల్పు
అనే బంగారు భావాలున్న

గీతాంజలి అంటే పాటల అర్పణ అని అర్థం. రవీంద్రనాథ్ హృదయార్పణగా ఆవిష్కరించిన ఆంగ్ల గీతాంజలికి 1913లో ఆసియా నుండి సాహిత్యంలో మొదటి నోబెల్ గ్రహీతగా మన రవీంద్రనాథ్ ఠాగూర్ నిలిచారు. అంతేకాదు, పాశ్చాత్య దేశాలకు తూర్పు ఆధ్యాత్మికతను పరిచయం చేసి, భారతదేశానికి ప్రపంచ స్థాయిలో కీర్తి కిరీటం పెట్టిన రవి కిరణం మన విశ్వకవి. ఆయన కీర్తి ప్రపంచవ్యాప్తంగా వెలుగొందుతుంది.

మరో గొప్ప ఘనత కూడా మన రవీంద్రనాథ్ ఠాగూర్ సొంతం చేసుకున్నారు. అదే

ప్రపంచంలోనే రవీంద్రనాథ్ ఠాగూర్ రెండు దేశాలకు జాతీయ గీతాలను అందించిన ఏకైక కవి.

జనగణమన భారతదేశ జాతీయ గీతం. భారతీయుల గొంతులోనే కాదు దేశ పౌరుల నరనరాల్లో దేశ అభ్యున్నతి రక్తంగా ప్రవహిస్తూ పరుగులు పెడుతుంది.

"జనగణమన అధినాయక జయ హే భారత భాగ్యవిధాతా...."

దీని అర్థం: ప్రజల మనస్సులకు నాయకుడైన నీకు జయము. భారతదేశ భాగ్యాన్ని నిర్ణయించేవాడివి నీవే అనే తత్వం ఇందులో ఉంది. ఇది విన్న ప్రతి భారతీయుడికి గర్వం, ఐక్యత గుర్తు తెచ్చే దేశభక్తిని స్ఫూర్తినిస్తుంది. అంత ప్రభావాన్ని ఈ జాతీయ గీతం కలిగించింది, కదిలించింది.

ఈ గీతాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ గారు 1911లో బెంగాలీ భాషలో రాశారు. ఈ పాటను మొదట తత్వబోధిని పత్రికలో భారత భాగ్య విధాత పేరుతో ప్రచురించారు.

ఈ గీతాన్ని 1950 జనవరి 24న భారత రాజ్యాంగ సభ అధికారికంగా జాతీయ గీతంగా ఆమోదించింది.

మొదటిసారి 1911 డిసెంబర్ 27న కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో పాడారు. మొత్తం 5 పాదాలు ఉంటాయి. కానీ జాతీయ గీతంగా మొదటి పాదం మాత్రమే పాడతాం. పాడడానికి దాదాపు 52 సెకన్లు పడుతుంది. ఈ పాటలో అణు-వణువునా దేశభక్తి వినిపిస్తుంది. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు, నదులు, పర్వతాలు, మతాలు, ప్రజల ఐక్యత గురించి ఉంది.

ఠాగూర్ గారే స్వరపరిచారు. తర్వాత మార్గరెట్ కజిన్స్, జేమ్స్ కజిన్స్ దీని స్వరకల్పనలో సహాయం చేశారు.

దీని సారాంశం: ఇది మన దేశ ఐక్యత, గౌరవం, వైవిధ్యాన్ని చూపించే గీతం. పాఠశాల ప్రార్థనల్లో, అధికారిక కార్యక్రమాల్లో ఈరోజుకీ తప్పనిసరిగా పాడతాం.

బాంగ్లాదేశ్ జాతీయ గీతం "అమర్ సోనార్ బంగ్లా". మన దేశ జాతీయ గీతం జనగణమన కంటే ముందే రవీంద్రనాథ్ ఠాగూర్ ఈ గీతాన్ని 1905 లో రాశారు.

ఇది బెంగాల్ విభజన సమయంలో "మదర్ బెంగాల్"కు నివాళిగా రాయబడింది.

తరువాత 1971లో బాంగ్లాదేశ్ స్వాతంత్ర్యం తర్వాత దీన్ని జాతీయ గీతంగా స్వీకరించారు. ఇలా రెండు దేశాల్లో భక్తి తత్వాన్ని చాటిచెప్పారు విశ్వకవి.

విశ్వగురువుగా, విశ్వమానవ గోత్రీయుడుగా

ఇలా దేవుని పై భక్తి, ప్రకృతితో ప్రేమ, మానవత్వాన్ని ముడిపెడుతూ... ఆత్మాన్వేషణను, ఆధ్యాత్మికతను పిల్లలకు కూడా అర్థమయ్యేటట్లు చాలా సరళమైన, హృదయానికి హత్తుకునే భాష వాడిన విశ్వకవి.

ఆయన అందించిన జాతీయ గీతాన్ని భారతమాత తన శిరస్సున దేశభక్తి కిరీటంగా ధరించి, యావత్తు భారత పౌరులు శిరస్సు ఎత్తి సెల్యూట్ చేస్తారు. రవీంద్రనాథ్ ఠాగూర్‌ను హత్తుకొని విశ్వగురువుగారి కీర్తిని శిఖరాన నిలిపింది. అనడంలో అతిశయం లేదు. భారత జాతి ఈయనకు హృదయాంజలి ఘటించవలసిందే.

కలం : వసంత కోకిల
రచన : డా. జి. మాలతి
అసిస్టెంట్ ప్రొఫెసర్
డా. లంకపల్లి బుల్లయ్య కళాశాల
విశాఖపట్నం.

# ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే "మన గ్రామం-మన బాధ్యత"

**చోడవరం ఆగస్టు 8**
**జయ జయహే**

"మన గ్రామం--మన బాధ్యత" కార్యక్రమంలో భాగంగా చోడవరం జనసేన పార్టీ ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు శనివారం చోడవరం మండలంలోని దామునాపల్లి, మైచర్లపాలెం, లక్కవరం, గవరవరం గ్రామాల్లో పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మరియు రైతులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు.

దామునాపల్లి గ్రామంలో

గ్రామంలోని జనసేన పార్టీ నాయకులతో సమావేశమైన పివిఎస్ఎన్ రాజు ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఇటీవల గాయపడిన పార్టీ అధ్యక్షులు తాడి గణేష్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మైచర్లపాలెం గ్రామంలో: జనసేన పార్టీ నాయకుడు నానుబిల్లి అచ్చుతరావు స్వయంగా ప్రారంభించిన పాదరక్షల తయారీ కర్మాగారాన్ని సందర్శించిన పివిఎస్ఎన్ రాజు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశమై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామంలోని పలువురు మహిళలను కలిసి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు.

లక్కవరం గ్రామంలో రైతుల సమస్యలపై ముఖాముఖిలో పాల్గొన్నారు.

పార్టీ నాయకులు కేవిఎస్ నాయుడు, వేచలపు



అప్పలనాయుడులతో కలిసి పివిఎస్ఎన్ రాజు లక్కవరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వ్యవసాయదారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పివిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ, రైవాడ నీరు సక్రమంగా అందేలా అవసరమైన కార్యాచరణ రూపొందించేందుకు త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యటించి, సమగ్ర నివేదికను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే సాధ్యమైనంత త్వరగా గ్రామంలో హ్యాండ్ బోరు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చక్కెర కర్మాగారం రైతుల బకాయిల విషయమై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ టి.జి. భరత్ ఇప్పటికే నిర్దిష్టమైన హామీ ఇచ్చారని, ఆ దిశగా చర్యలు కొనసాగుతున్నందున త్వరలోనే రైతుల సమస్య పరిష్కారం అవుతుందని ఆయన తెలిపారు.

అనంతరం గ్రామ పార్టీ అధ్యక్షులు నడిగట్ల క్రాంతికుమార్ తండ్రి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రామ అప్పారావు, చోడవరం వీర మహిళ అధ్యక్షురాలు నందవరపు రమాదేవి నాయుడు, చోడవరం వినాయక ట్రస్ట్ బోర్డు చైర్మన్ మంగ శ్రీనివాసరావు, చోడవరం పట్టణ పార్టీ అధ్యక్షులు కర్రి రమేష్, పార్టీ నాయకులు దండుపాటి తాతారావు, మజ్జి సంతోష్, చప్పగడ్డ శ్రీను, కోన వాసు, చప్పగడ్డ రాము, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.




## చలో విద్యుత్ సౌదా ధర్నాను జయప్రదం చేయండి

**అనకాపల్లి జయ జయహే**

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దశల వారి పోరాటంలో భాగంగా ఆగస్టు 10న చలో విజయవాడ విద్యుత్ సౌదా ధర్నా కార్యక్రమానికి ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని యూనిటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ సిఐటియు పిలుపునివ్వడం జరిగింది స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో నాయకులు పాల్గొని పిలుపునివ్వడం జరిగింది సిఐటియు అధ్యక్షులు ప్రేమ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వం ఉద్యోగులను కాంట్రాక్ట్ కార్మికులను మోసగిస్తున్నదని పి.ఆర్.సి వెంటనే వేయాలని కాంట్రాక్టు కార్మికుల సంస్థల విలీనం చేసి రెగ్యులర్ చేయాలని విద్యుత్ రంగాన్ని కాపాడుకోవడం వల్ల విద్యుత్ ఉద్యోగులు ప్రజలను కలుపుకొని ప్రజల ఆస్తిగా ఉన్న ఈ రంగాన్ని అంబానీ ఆదాని లాంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడాని అడ్డుకోవాలని వారు పేర్కొన్నారు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వ్యాపాద సత్యనారాయణ మాట్లాడుతూ మా కాంట్రాక్ట్ ఉద్యోగులు ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగ భద్రత లేక కనీసం పక్క తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చినట్లుగా 48 వేల రూపాయలు బేసిక్ ను కూడా అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులను మోసం చేస్తున్నదని సమాన పనికి సమాన వేతనం కోసం రెగ్యులైజేషన్ కోసం ఉద్యోగులందర్నీ విద్యుత్ స్ట్రగుల్ కమిటీ ఐక్యం చేసి పోరాడుతుందని వారు పేర్కొన్నారు దీనిలో భాగంగా ఆగస్టు 10న విజయవాడలో చలో విద్యుత్ సౌదా వద్ద జరుగు నిరసన లో పెద్ద ఎత్తున కార్మికుల పాల్గొని ఈ ధర్నాను జయప్రదం చేయాలని వారు పిలుపునివ్వడం జరిగింది ప్రభుత్వం తమ కోరికలను ఆమోదించాలని లేనిపక్షంలో తమ నిరసన ను తీవ్రతరం చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనిటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, ఎస్ సత్య రావు అనకాపల్లి డివిజన్ అధ్యక్షులు పి శ్రీనివాసరావు నర్సీపట్నం డివిజన్ అధ్యక్షులు ఎస్ రమేష్ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్ అవతారం కే రాజేష్ కె పరమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు



## సీసీ రోడ్లు శంకుస్థాపన చేసిన ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి నియోజకవర్గం కసింకోట మండలం , కన్నూరు పాలెం నుండి తోటకూర పాలెం వరకు ఎంపీ నిధులతో మూడు కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శనివారం శంకుస్థాపన చేయడం జరిగింది. గ్రామంలో పలు అభివృద్ధి జరిగిన పనులను ఘనంగా ప్రారంభించారు పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మరియు నాబార్డ్ ఆర్ ఐ డి ఎఫ్ నిధులతో సుమారు 85 లక్షల రూపాయలతో వేయించిన తార్ రోడ్డు తో పాటు ఎంపీ లాండ్స్ 2025/26 నిధులనుంచే సుమారు ఆరు లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ షడ్డును వీరు ప్రారంభించారు జాతీయ రహదారి నుంచి జమాదులపాలెం గ్రామం వరకు నిర్మించిన తారు రోడ్డు అందుబాటులోకి రావడంతో పరిసర గ్రామ ప్రజలు కు మెరుగైన రవాణా సౌకర్యాలు కలగనున్నాయని ఈ రహదారి నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లభించడంతోపాటు ప్రజల రాకపోకలు సులభతరం కానున్నాయి అని వారు పేర్కొన్నారు అలాగే వ్యవసాయం ఉత్పత్తులు, రవాణా, విద్య, వైద్యం మరియు ఇతర అత్యవసర సేవలకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. వారు ఆనంద వ్యక్తం చేశారు అలాగే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా తాగునీటి సమస్య పరిష్కారం లభించింది అని గ్రామీణ ప్రాంతాల ముఖ్యమైన మౌలిక వసతులు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ రహదారులు తాగునీరు వంటి ప్రాథమిక సదుపాయలు అందుబాటులోకి తీసుకురావడం పట్ల గ్రామస్తులు ఎంపీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశంపార్టీ ఇన్చార్జి పి గోవింద సత్యనారాయణ అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వర్ గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర డి సి ఎం ఎస్ చైర్మన్ కే బాలాజీ బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపరెడ్డి పరమేష్ రావు కూటమి నాయకులు మండల నాయకులు గ్రామ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



## డీఎస్సీ అవకతవకలపై తక్షణ విచారణ జరపాలి

### వైసీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్... మాజీ డిప్యూటీ సీఎం బూడి

**మాడుగుల ఆగస్టు 8 జయ జయహే**

డిఎస్సిలో జరిగిన అవకతవకలుతో అవినీతిపై తక్షణమే సిబిఐ విచారణ జరిపించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు డిమాండ్ చేశారు. డీఎస్సీ అవక తవకులపై విచారణ జరపాలంటూ గత మూడు రోజులుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు పార్టీకి చెందిన యువత విద్యార్థులు తో కలిసి నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా శనివారం మాడుగుల శిబిరాన్ని జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ తో పాటు అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు శోభ హేమావతి, మాడుగుల నియోజకవర్గ పరిశీలకుడు పైల శ్రీనివాసరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగంతో ఉన్న నిరుద్యోగులుకు నిరుద్యోగభృతి బకాయిలు 78,000రూపాయలు,ప్రతి నెల 3000 రూపాయలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. చదుకుంటున్న విద్యార్థులుకు ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల్లో జరిగిన మెగా డిఎస్సిలో జరిగిన అవకతవకలుతో కూడిన అవినీతిపై నైతిక బాధ్యత వహించి రాష్ట్ర విద్యాశాఖ శాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామ చేయాలనీ డిమాండ్ చేశారు. మాడుగుల నియోజకవర్గం సమన్వయకర్త ,మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లే అనురాధ, మాడుగుల ఎంపిపి రాజారాం, మండల పార్టీ అధ్యక్షుడు ధర్మజ, జడ్పిటిసి కే రమణమ్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎస్ కొండలరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు బి శ్రీనివాసరావు, దేవరపల్లి మండల పార్టీ అధ్యక్షుడు బూరే బాబురావు, కె కోటపాడు దేవరపల్లి మాడుగుల మండలాలుకు చెందిన ముఖ్య కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు



## కూటమి ప్రభుత్వం విజయోత్సవం పై ఇంటింటి ప్రచారం

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి నియోజకవర్గశీ కసింకోట మండలం , కన్నూరుపాలెం, జమాదుల పాలెం కూటమి ప్రభుత్వం రెండేళ్లు పాలనపై విజయోత్సవం పై ఇంటింటి ప్రచారం కార్యక్రమం లో భాగంగా అనకాపల్లి పార్లమెంటు సభ్యులు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ పాల్గొన్నారు. ప్రభుత్వం రెండేళ్లు పాలనలో ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమాలు అమలు చేసిన పథకాలు సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నదని అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరాల కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు ఈ ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఎపియుఎఫ్ ఐ డిసి చైర్మన్ పి గోవింద సత్యనారాయణ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరావు కూటమి సభ్యులు పార్టీ కార్యకర్తలు మహిళా సోదరీమణులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు



## సర్ రెండవ దశపైన కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన కోలా ఆనంద్

### శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 319కి పెరిగిన పోలింగ్ బూత్‌ల సంఖ్య

**శ్రీకాళహస్తి, ఆగస్టు 08,జయ జయహే**

పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయం లో రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ నూతన ఓటర్ల జాబితాలను బూత్ లెవెల్ ఏజెంట్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ ఓటర్ల సౌకర్యం దృష్టిలో పెట్టుకుని పోలింగ్ బూత్ ల సంఖ్యను 294 నుంచి 319కి పెంచడం జరిగిందన్నారు. సర్ రెండవ దశ కార్యక్రమంలో బి ఎల్ ఓ లతో కలసి అర్హత ఉన్న నూతన ఓటర్ నమోదు, అర్హత లేని ఓటర్ తొలగింపు, తప్పులున్న ఓటర్ సరిచేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ తమ ఓటును సరిచేసుకొనుటకు ఈ ఓటర్ జాబితాల ఆధారంగా అర్హులైన వారు ఓటరుగా నమోదయ్యేలా చూడాలని బూత్ కమిటీ సభ్యులకు, కార్యకర్తలకు, నాయకులకు కోలా ఆనంద్ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు, అసెంబ్లీ కో - కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, మండల అధ్యక్షులు వేదం కృష్ణయ్య, భాగితి వెంకటేష్, నరేష్, రాష్ట్ర కిషన్ మోర్చా కుప్ప ప్రసాద్, జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు ప్రజ్ఞా శ్రీ,, ఉపాధ్యక్షురాలు రామ్ ఉమా సింగ్, సీనియర్ నాయకులు సొట్ట సుకుమార్, జీవి అమర్నాథ్, కన్నా వెంకటేశ్వర్లు, నాగలాపురం గోవర్ధన్, పుణ్యం ఢిల్లీకుమార్ రెడ్డి, మద్దు వాసుయాదవ్, పుచ్చకాయల రమేష్ యాదవ్, ఇమ్మిడిశెట్టి మెహన్, ఫ్లెక్సీ కృష్ణారెడ్డి, తానికొండ్ల భరత్ నాయుడు, నిడిగింటి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## లోకేష్‌తో చర్చించేందుకు గొడ్డలి పార్టీ నేతకు దమ్ముందా

### రాష్ట్ర టిడిపి కార్యదర్శి. యం.సుబ్బయ్య

**శ్రీకాళహస్తి, ఆగస్టు 08,జయ జయహే.**

'టీడీపీ అంటేనే డీఎస్సీ' అని, నిరుద్యోగుల భవిష్యత్తు కోసం తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టిందని రాష్ట్ర టిడిపి కార్యదర్శి మాసారపు సుబ్బయ్య స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ నిర్వహణపై బహిరంగ చర్చకు సిద్ధమని మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్ను స్వీకరిస్తూ లోకేష్తో చర్చించేందుకు గొడ్డలి పార్టీ నేతకు దమ్ముందా? అని ఆయన ప్రశ్నించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షం డీఎస్సీపై సత్యదూరమైన ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలతో ఆడుకుంటూ ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు ఆపాలని, ధైర్యముంటే నేరుగా చర్చకు రావాలని సవాల్ విసిరారు.




## కమనీయం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం

**శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 08,జయ జయహే.**

శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురంలో రెండవ శనివారం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం. కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు రమణదీక్షితులు ఆధ్వర్యంలో కళ్యానోత్సవం వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మాధవస్వామి, బాబు స్వామి, జయ స్వామి,గోపి స్వామి, ఆలయ ఇన్స్పెక్టర్ సుధీర్, ఆనంద్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే

# డిగ్రీ కళాశాలకు ఎంపీ వరాల జల్లు

## మాడుగుల డిగ్రీ కళాశాలను మోడల్గా తీర్చిదిద్దుతా

### కళాశాల భవనాలను ప్రారంభించిన ఎంపీ

**మాడుగుల ఆగస్టు 8 జయ జయహే**



మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను జిల్లాలో మోడల్ డిగ్రీ కళాశాల గా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామని అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు డాక్టర్ సీఎం రమేష్ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం కోటి రూపాయలు ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించిన మాడుగుల డిగ్రీ కళాశాల భవనాలను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మాడుగుల డిగ్రీ కళాశాలకు ఇప్పటివరకు భవనం లేకపోవడం విచారకరమన్నారు. అందుకే విద్యకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ఎమ్మెల్యే బండారు కోరిక మేరకు వెంటనే కోటి రూపాయలు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. అయితే కళాశాలకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని విద్యార్థులు మాత్రం బాగా చదువుకొని జిల్లాలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తామన్న హామీ ఇవ్వాలని కోరారు. అందుకు విద్యార్థులు ఉన్న ఒక విద్యార్థిని మాట ఇవ్వడంతో ఆమెను ఎంపీ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఈ కళాశాల కు వెళ్లేందుకు రహదారిలేదని కాబట్టి రహదారి నిర్మాణంతోపాటు కళాశాల ప్రాంగణమంతా చదును చేసి ఆటస్థలం నిర్మాణం, ఆరో ప్లాంట్ ఏర్పాటు, ఆరోగ్య రీచా జిమ్ ఏర్పాటు, ముఖ్యంగా కళాశాలకు విద్యార్థులకు రక్షణ కల్పించే విధంగా ప్రహరీ గోడ నిర్మాణం, గ్రిల్స్ ఏర్పాటు, కంప్యూటర్లు డిజిటల్ బోర్డులు ఏర్పాటు, ఫర్నిచర్ సౌకర్యం కల్పించడం వంటివి చేస్తామని చెప్పారు. ప్రభుత్వ నిధుల నుంచి కానీ సిఎస్ఆర్ నిధుల నుంచి కానీ ఎంపీ నిధులు నుంచి కానీ అవేవీ కానిపక్షంలో తన సొంత నిధుల నుంచి కూడా వెచ్చిస్తామని స్పష్టం చేశారు. వెనుకబడ్డ మాడుగుల ప్రాంతం అన్నివేదల అభివృద్ధి చేయాలని తమ లక్ష్యమని ఈ దిశగా తగు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రహదారి రమణ సౌకర్యాలు మెరుగుపరచడం ఉద్యోగ అవకాశాలు కల్పించడం తో పాటు పారిశ్రామిక ప్రగతి సాధించడం వంటివి చేయాలన్నారు. అందుగ్గాను నేషనల్ హైవేకు కనెక్టు వచ్చే విధంగా పెనగాడి పాడేరు జాతీయ రహదారి విస్తరణలో మాడుగుల మీదుగా నిర్మించే విధంగా డిపిఆర్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోనే అనకాపల్లి జిల్లా అభివృద్ధిలో పరుగులు పెడుతుందని ఐదు లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు తెచ్చామని వాటిలో రెండున్నర లక్షల కోట్లు ప్రైవేట్ భాగస్వామ్యంలో ఉన్నాయన్నారు. ఇప్పటికే ఎన్నికలు ఇచ్చిన హామీ వరకు కాశి అయోధ్యకు మొదటి విడతలో కొంతమందిని పంపించామని మరో విడుదల కూడా మరికొందరిని పంపిస్తామని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ పి జయ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా వేరే వసతిలో నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాలకు పక్క భవనాలు నిర్మించాలన్న స్థానిక నాయకుల కోరిక మేరకు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ చొరవతో కోటి రూపాయలు మంజూరు చేశారని దీంతో విద్యార్థులకు వసూల్ సౌకర్యం సమకూరిందన్నారు. ఇదిగో ఎంపీపీ అయినా ధన్యవాదాలు తెలిపారు. అలాగే కళాశాలకే అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీలు కోరారు. పెనగాడి పాడేరు నేషనల్ హైవే రోడ్డు డిపిఆర్ తయారులో ఎంపీ మరింత కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలోనే అనకాపల్లి పార్లమెంటు ఉత్తమ స్థానంలో ఉందని అభివృద్ధిలో దూసుకుపోతుందని కొనియాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తులఅతాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పి లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీకు ఎమ్మెల్యేకు పూర్ణ కుంభంతో స్వాగతం విద్యార్థులు దింస నృత్యంతో అలరారించారు. ఈ సందర్భంగా ఎంపీను ఎమ్మెల్యేను ఏఎంసీ చైర్మన్ పి అప్పలరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పి లక్ష్మీనారాయణ, కళాశాల తరఫున ప్రిన్సిపల్ సిబ్బంది , న్యాయవాది యస్ ప్రమోద్, బిజెపి నాయకుడు కర్రీ రాజు తదితరులు సాలూరుతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ కోటి బాలాజీ, ఏఎంసీ చైర్మన్ పి అప్పలరాజు, డైరీ డైరెక్టర్ సీరంరెడ్డి సూర్యనారాయణ, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ శాస్త్రి, సహకార సంఘ అధ్యక్షుడు కొట్నాల త్రినాథ్, పెద్దేరు జలాసయ కమిటీ చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు,బిజెపి టిడిపి జనసేన మండల పార్టీ అధ్యక్షులు ఎన్ సన్యాసిరావు, మెల్లిపాక స్వామి, జి శివాజీ, కూటమి నాయకులు మండల సతీష్, పుట్ట నానాజీ, మరువాడ ఈశ్వరరావు, కే రమేష్,కే నానాజీ, ఎల్ కాశి బాబు తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగ చిన్నారుల మధ్య

# రేష్మిత జన్మదిన వేడుకలు

**పాయకరావుపేట జయ జయహే ఆగస్టు 08:-**

విశాఖ నగరంలోని ఉషోదయ జంక్షన్‌లో ఉన్న హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో హోంమంత్రి వంగలపూడి అనిత కుమార్తె రేష్మిత జన్మదిన వేడుకలు ఆప్యాయంగా జరిగాయి. ఈ సందర్భంగా రేష్మితతో పాటు ఆమె సోదరుడు నిఖిల్ ప్రత్యేక పాఠశాలలోని దివ్యాంగ చిన్నారులతో మమేకమయ్యారు. చిన్నారుల మధ్య రేష్మిత కేక్ కట్ చేసి, వారితో కలిసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అనంతరం చిన్నారులకు రేష్మిత స్వయంగా పోషకాహారం, తాజా పండ్లను పంపిణీ చేశారు. చిన్నారులతో కొంతసేపు ఆప్యాయంగా గడుపుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల హోంమంత్రి అనిత కుమారుడు నిఖిల్ కూడా విజయవాడలోని మేరీ బ్లైండ్ పాఠశాలలో తన జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఆర్భాటాలకు దూరంగా ప్రత్యేక పాఠశాలల చిన్నారుల మధ్య సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు నిర్వహించడం ద్వారా హోంమంత్రి అనిత కుటుంబం మానవత్వాన్ని చాటుకుంది.



## భూమి ఛానెల్‌లో

# ఆక్రమణలు తొలగించాలి

**పాయకరావుపేట జయ జయహే ఆగస్ట్ 8**

: వేలాది ఎకరాల రైతుల పంట పొలాలకు సాగునీరు అందించే భూమి ఛానల్ పొడవునా ఆక్రమణలకు గురవడంతో ఛానెల్ ద్వారా వచ్చే సాగనీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇంచార్జి, అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబరు గెడ్డం బుజ్జి తన సొంత నిధులతో పిఎల్ పురం మధుము నుంచి ఉద్దండపురం వరకూ పూడికతీత పనులు చేయించారు. అయితే ఐదు లక్షలు గ్రాంటు మంజూరు అయింది. మంజూరైన నిధులతో పుడికతీత పనులు చేపడుతుండగా మొత్తం అంతా కాలవ పరిధి ఆక్రమణలకు గురైంది. 2.20 మిషన్ కాలువ దిగి మురగడ త్రవ్వకాలు చేపడుతూ ఉండడంతో ఆక్రమణల వల్ల సాధ్యం కావడం లేదు. పోలీస్ స్టేషన్ వద్ద నుంచి కనోసా స్కూల్ వరకూ త్రవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ రోడ్డు దాటాలంటే ట్రాలీ పెట్టి దాటాలి. ఇటు దాటాలంటే పదివేలు రూపాయలు ఖర్చు అవుతుందని అలాగే షుగర్ ఫ్యాక్టరీ దగ్గర నుంచి అటు దాటాలంటే మరో పది వేలు రూపాయలు ఖర్చు అవుతుంది అని అయితే మట్టి తీసేందుకు మిషన్లకు త్రోవ లేకుండా ఆక్రమణలు ఉండడంతో త్రవ్వకాలు జరిగే పరిస్థితి కనపడలేదు. అయితే రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి రైతులకు భూమి చానల్ ద్వారా సక్రమంగా సాగినీరు అందించాలని గెడ్డం బుజ్జి రెవిన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భూమి ఛానల్ చైర్మన్ గెడ్డం చైతన్య, జనసేన పార్టీ విశాఖ జిల్లా సంయుక్త కార్యదర్శి పల్లి దుర్గారావు పాల్గొన్నారు.



# ఘనంగా తోట నగేష్ పుట్టినరోజు వేడుకలు

**పాయకరావుపేట జయ జయహే ఆగస్ట్ 8**

జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ పుట్టిన రోజు వేడుకలు శనివారం ఆయన స్వగృహం వద్ద ఘనంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా తెలుగుదేశం, వైసిపి, జనసేన, బిజెపి, సిపిఐ, సిపిఎం తదితర రాజకీయ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పారిశ్రామిక వేత్తలు, డెక్కన్, హెటిరో కంపెనీల ఉద్యోగులు, వ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో విచ్చేసి నగేష్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. భారీ బర్త్ డే కేక్ లు కట్ చేశారు. పూలమాలలు, బోకేలు, చిత్రపటాలు, మెమెంటోలు అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాలు, భారీ గజమాలలతో ఘనంగా సత్కరించారు. హిందూ, క్రైస్తవ, ముస్లిం మత పెద్దలు, పురోహితులు, పాస్టర్లు విచ్చేసి నగేష్ కు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తోట నగేష్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు అందజేశారు. సమత సిడి ప్రోజెక్ట్ హాస్టల్ లో చదువుతున్న విద్యార్థులకు ఒక నెలరోజుకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసారు. టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఘనంగా సత్కరించి ప్రోత్సాహకాలు అందజేశారు. విద్యార్థినీ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. పట్టణంలోని చిత్రమందిర్ థియేటర్ సెంటర్ ఆటో యూనియన్ నాయకులు అన్న కేంటిన్ లో 700 మంది పేదలకు తమ సొంత నిధులతో ఉచితంగా భోజనాలు అందజేశారు. ఈ సందర్భంగా తోట నగేష్ మాట్లాడుతూ... తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.



# శ్రీ ప్రకాష్‌లో హోరాహోరీగా సాగుతున్న సిబిఎస్ఇ సౌత్ జోన్-1 హ్యాండ్ బాల్ పోటీలు

**పాయకరావుపేట జయ జయహే ఆగస్ట్ 8**

శ్రీ ప్రకాష్ లో సిబిఎస్ఇ సౌత్ జోన్ - 1 హ్యాండ్ బాల్ పోటీలు రెండో రోజుకు చేరుకోగా వివిధ విభాగాల్లో పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సీబీఎస్ఈ పాఠశాలల క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శిస్తూ విజయమే లక్ష్యంగా తలపడుతున్నారు. సుమారు మూడు రాష్ట్రాల నుండి 2500 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలు ఆద్యంతం ఎంతో ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ... ఈ పోటీల ఫైనల్స్ 10 వ తేదీన జరుగుతాయని, ఫైనల్స్ కు చేరుకోవడానికి ప్రతీ జట్టు ఎంతో శ్రమిస్తుందని, ప్రతి మ్యాచ్ ప్రాధాన్యత సంతరించుకుందని, విజయం సాధించి తదుపరి దశకు అర్హత సాధించేందుకు జట్లు అత్యంత వ్యూహాత్మకంగా, పట్టుదలతో పోరాడుతున్నాయన్నారు. దీంతో పోటీలు మరింత ఆసక్తికరంగా మారాయన్నారు. ప్రతి మ్యాచ్‌లోనూ క్రీడాకారులు ఉత్సాహం, క్రమశిక్షణ, జట్టు సమన్వయం, పోటీతత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్ మూర్తి, ప్రిన్సిపల్ రవి, సిబిఎస్ఇ పర్యవేక్షకులు స్వామి, వివిధ రాష్ట్రాలనుండి వచ్చిన క్రీడాకారులు, కోచ్లు, మేనేజర్లు పాల్గొన్నారు.



# చెరువుల అభివృద్ధి పనులను పరిశీలించిన సీఎం రమేష్, కొణతాల రామకృష్ణ

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి నియోజకవర్గ కసింకోట మండలం కసింకోట, బయ్యవరం గ్రామాల్లో జరుగుతున్న చెరువుల అభివృద్ధి పనులను అనకాపల్లి పార్లమెంటు సభ్యులు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ అనకాపల్లి శాసనసభ్యులు మాజీ మంత్రి కొణతాల శనివారం ఆ ప్రాంతాల్లో జరుగుతున్న చెరువు అభివృద్ధి పనులను వారు పరిశీలించడం జరిగింది . అక్కడ జరుగుతున్న చెరువుల అభివృద్ధి పనులను పురోగతిని పరిశీలించి అక్కడ స్థానికులను అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు చెరువు పరిసర ప్రాంతాలను ప్రజలకు ఆహ్లాదకరంగా ఆరోగ్యకరమైన వాతావరణ అందించే విధంగా పార్కులుగా తీర్చిదిద్దేందుకు అలాగే చెరువు పరిసరాల గట్టుపై ప్రజల సౌకర్యం సౌకర్యార్థం వాకింగ్ ట్రాక్ ఓపెన్ జిమ్ పచ్చని చెట్లు ఆహ్లాదకర వాతావరణ శీ అందించే విధంగా కుటుంబ సభ్యులు ఆహ్లాదంగా గడిపేందుకు వాతావరణం ఉండేలాగా ఏర్పాటు చేయాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే పి గోవింద సత్యనారాయణ కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# గిరిజనులకు సంఘీభావం తెలిపిన సుజాత సాల్మన్

**అరకు: ఆగష్టు08. జయ జయహే.**



గిరిజనుల హక్కులు, భూమి, ఉపాధి రాజ్యాంగ పరిరక్షణ కోసం నిర్వహించిన ఆగస్టు 8 మన్యం బంద్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ అరకు నియోజకవర్గ నాయకురాలు సుజాత సల్మాన్ పాల్గొని గిరిజనులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌కు పూర్తి రక్షణ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు సుజాత సల్మాన్ ప్రధాన డిమాండ్లు:చేసారు 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. 5వ షెడ్యూల్ హక్కులను సంపూర్ణంగా పరిరక్షించాలి. గిరిజనుల భూములపై జరుగుతున్న అక్రమాలను అరికట్టాలి. గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల హక్కులు, ఉపాధి, స్వయం పాలనకు రక్షణ కల్పించాలి. గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాల్లో న్యాయం చేయాలి. గిరిజనుల రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించే చర్యలను ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలి. “గిరిజనుల హక్కులు కాపాడటమే మా లక్ష్యం. 1/70 చట్టం, 5వ షెడ్యూల్ అమలు విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. గిరిజనుల గొంతుకగా ప్రజా ఉద్యమాల్లో నిరంతరం ముందుంటాం” అని సుజాత సల్మాన్ పేర్కొన్నారు.



# మన్యం బంద్ విజయవంతం

## స్వచ్ఛందంగా మూతబడిన కిరాణా దుకాణాలు పెట్రోల్ బంక్ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం.

**అరకు: ఆగష్టు 08 జయ జయహే,**

దుంబ్రిగూడ మండల కేంద్రంలో మన్యం బంద్ విజయవంతం గా జరిగింది, అనంతరం జీవో నెంబర్ 3 కు బదులుగా ప్రత్యామ్నాయ జీవో కల్పించాలని,1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలని, అల్లూరి జిల్లా ను జోన్ 1 లోనే కొనసాగించాలని, మన్యంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు జారీ చేసిన జీవోలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజన సంఘం, గిరిజన సంఘాలు పిలుపునిచ్చిన మన్యం బంద్ శనివారం మండలంలో విజయవంతంగా జరిగింది. పెట్రోల్ బంక్ , పర్యాటక కేంద్రాలైన చాపరాయి జలపాతం , అరకు పైనరీ స్వచ్ఛందంగా మూతపడ్డాయి.కిరాణా దుకాణదారులు కూడా స్వచ్ఛందంగా మూసివేసి బంద్ కు సంఘీభావం ప్రకటించారు. ఆదివాసి గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు, వైసిపి నాయకులు ఉదయం నుంచి మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు వద్ద బంద్ పాటించారు. మండల కేంద్రంలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద గిరిజన సంఘాల నాయకులు, గిరి యువత, వైసిపి నాయకులు బైఠాయించి గిరిజనుల హక్కులు,చట్టాలు, భూముల జోలికొస్తే ఖబర్దార్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మూడు రోడ్ల జంక్షన్ నుండి బిఎస్ఎన్ఎల్ టవర్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం , అంజోడా సిల్క్ ఫారం లోగల అరకు పైనరీ మూతబడటంతో పర్యాటక కేంద్రాలు పర్యాటకులు లేక బోసిపోయి కనిపించాయి. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్ బి పోతురాజు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు పి సురేష్ కుమార్, మండల కార్యదర్శి పి సత్యనారాయణ, మండల కార్యదర్శి కే సింహాచలం, వైసిపి మండల అధ్యక్షుడు పి పరశురాం, నాయకులు బి సింహాచలం, కే హరి, జి నాగేశ్వరరావు, కే విజయదశమి, ఏం శంకర్ ,అపార్టీ ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్ లు గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భారత్ గ్యాస్ లైట్ జిప్ సిలండర్ ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి

### బుక్ చేసిన నాలుగు గంటల్లోనే సిలిండర్

**విశాఖపట్నం /ఎంవీపీకాలనీ (జయ జయహే )**

బుక్ చేసిన నాలుగు గంటల్లోనే భారత్ గ్యాస్ లైట్ జిప్ సిలిండర్ ను పంపిణీ చేయడం అరుదైన విషయమని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు అన్నారు. శనివారం ఉదయం ఎంవీపీ కాలనీలోని ప్రతిభా గ్యాస్ ఏజెన్సీలో 10 కిలోల భారత్ గ్యాస్ లైట్ జిప్ సిలిండర్ ను ఆయన ఆవిష్కరించి వినియోగదారులకు అందజేశారు. విశాఖలో తొలిసారిగా ప్రతిభా గ్యాస్ కంపెనీలో ప్రయోగాత్మకంగా 10 కిలోల ఇన్స్టెంట్ గ్యాస్ సిలిండర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రతినిధులు గద్దె ఫణీంద్ర మాట్లాడుతూ ఏదైనా ఐడీ కార్డు సహాయంతో ఎవరైనా ఈ ఇన్స్టెంట్ గ్యాస్ సిలిండర్ ను పొందేందుకు అవకాశం ఉందన్నారు. తక్కువ బరువు, సంపూర్ణ భద్రత కలిగిన సిలిండర్లు మహిళలు విని యోగించుకునేందుకు అనువుగా ఉంటుందన్నారు. దేశంలో ఆగస్టు 15 నాటికి వంద నగరాల్లో ఈ తరహా సిలిండర్లను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించామన్నారు. విదేశాల్లో ఇలాంటి తక్కువ బరువు కలిగిన సిలిండర్ల వినియోగం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో



ఏపీ తెలంగాణ కమర్షియల్ మేనేజర్ ప్రశాంత్ సూర్యవంశీ, విశాఖపట్నం జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కరరావు, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు కె. శ్రీనివాసరావు, బీపీసీఎల్ సెల్స్ ఆఫీసర్ పి.ఎస్. బాలు తదితరులు పాల్గొన్నారు.




## ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ తుహిన్ సిన్హా మరియు ఎస్ డి పి ఓ అనకాపల్లి వారి ఉత్తర్వులు మేరకు అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం వెంకటనారాయణ శనివారం శ్రీ కన్య జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హెల్మెట్ ధరించడం ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం సెల్ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయకూడదని వాహనాలు అతివేగం పనికిరాదని మద్యం సేవించే డ్రైవింగ్ చేయడం నేరమని మైనర్లు వాహనాలను నడపడం వంటి అంశాలపై వారికి అవగాహన కల్పించారు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎక్కడైనా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని చూసిన వెంటనే 108కి ఫోన్ చేసి హాస్పటల్ తరలించే వారిని రక్షించే చర్యలు తీసుకోవాలని అది ఒక పౌరుడు ప్రథమ కర్తవ్యం గా భావించి ఆదుకోవాలని వారు విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు



## అచ్చుతాపురం మండలంలో బీజేపీ ఆత్మీయ సమావేశం

**అచ్చుతాపురం, ఆగస్టు 8, జయ జయహే:**

అచ్చుతాపురం మండలంలో భారతీయ జనతా పార్టీ ఆత్మనిర్భర మండల స్థాయి సమావేశం ఉత్సాహంగా జరిగింది. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, సంస్థాగతంగా పార్టీని విస్తరించడం, రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత చురుకుగా ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షులు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు ఆదేశాలతో ఈ సమావేశం జరిగింది. మండల అధ్యక్షులు కుంద్రపు నాయుడు బాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు పట్టాబి ప్రసాద్ ని అచ్చుతాపురం మండల ఇంచార్జిగా నియమించడం జరిగింది. పార్టీని సంస్థాగతంగా ఎలా బలోపేతం చేయాలి, గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని ఎలా పటిష్టం చేయాలి, భవిష్యత్‌లో పార్టీకి సంబంధించిన బాధ్యతలు మరియు రాజకీయ అవకాశాలను ఎలా సాధించాలి అనే అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి నియోజకవర్గ ఇంచార్జి రాజాన సన్యాసినాయుడు, జిల్లా కార్యదర్శి కోరుపోలు చిన్నారావు, రాష్ట్ర సైనిక్ సెల్ కో-కన్వీనర్ అగ్గాల హనుమంతరావు, మైనారిటీ మోర్చా డైరెక్టర్ భాషా, మహిళా మోర్చా నాయకురాలు చుక్క అనురాధ మరియు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నాగలాపురం బైపాస్‌లో వాహన తనిఖీలు చేపట్టిన ఎస్ ఐ సునీల్

**సత్యవేడు, ఆగస్టు 08,జయ జయహే.**

నాగలాపురం మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో శనివారం సాయంత్రం ఎస్సై సునీల్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను ఆపి సరైన పత్రాలు ఉన్నాయా, హెల్మెట్, సీటు బెల్ట్ ధరించారా అని పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన కొందరికి జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ తమ కోసం కాదని, తమ కుటుంబం కోసం ధరించాలని ఎస్సై సునీల్ సూచించారు.



## గింజర్తి బడికి గ్రీన్ సిగ్నల్

### 1 నుంచి 5వ తరగతుల వరకు పాఠశాల కొనసాగింపు.

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 09,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం గింజర్తి గ్రామ ప్రజలు, ఎస్ఎంసి సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు 4 రోజులుగా చేస్తున్న శాంతియుత ఆందోళనకు ఫలితం లభించింది. గింజర్తి పాఠశాలను ఇకపై 1 నుంచి 5వ తరగతి వరకు బేసిక్ ప్రైమరీ పాఠశాలగా కొనసాగించాలని విద్యాశాఖ నిర్ణయించింది. మండల విద్యాశాఖాధికారి, పి.సింహాచలం జిల్లా విద్యాశాఖాధికారి తో ఫోన్ లో మాట్లాడి ఈ విషయాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తులకు తెలియజేశారు.మండల విద్యాశాఖాధికారుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎంఈఓ తెలిపారు. గతంలో ఇతర పాఠశాలలకు మ్యాపింగ్ చేసిన 3, 4, 5వ తరగతుల విద్యార్థులను తిరిగి గింజర్తి పాఠశాలలోనే చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.నాలుగు రోజులుగా ఎండ, వానలు సైతం లెక్కచేయకుండా విద్యార్థుల విద్యా హక్కు కోసం పోరాడిన గ్రామస్తులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసి సభ్యులు, గ్రామ పెద్దల ఆందోళనకు ఈ నిర్ణయంతో ముగింపు పలికింది.పాఠశాలను కొనసాగించేందుకు సహకరించిన గ్రామ ప్రజలు, ఎస్ఎంసి సభ్యులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులకు ఎంఈఓ కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల పరిశుభ్రత, మరమ్మతులు, పెయింటింగ్ వంటి అభివృద్ధి పనులు చేయాలని సూచించారు. నాలుగు రోజుల పోరాటం ఫలించడంతో గింజర్తి విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



## ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

**కవిటి: (జయ జయహే)**

ఈనెల 1వ తేదీ నుంచి వారం రోజులు పాటు నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు శనివారంతో ముగిసాయి ఈ సందర్భంగా మండలం గొర్లపాడు అంగనవాడి కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రాకేష్ , డాక్టర్ వందితలు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతం వంటి వని నవజాతి శిశువుల నుంచి 2000 వరకు బిడ్డకు తల్లిపాలు ఎంతో అవసరమనే అన్నారు ఈ సందర్భంగా ఈ సందర్భంగా తల్లిపాలు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు సీమంతలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి ఎస్. మోహిని ఏఎన్ఎం లు ఆర్ వజ్రం సిహెచ్ చైతన్య మరియు అంగన్వాడి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




## జాబ్ మేళా ఘన విజయం

**విశాఖపట్నం జయ జయహే**

అల్-ఇమ్దాద్ ఛారిటబుల్ ట్రస్ట్, వినెక్స్ డిగ్రీ కాలేజ్ మరియు ప్లేస్‌మెంట్ పార్క్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా శనివారం ద్వారకానగర్‌లోని వినెక్స్ డిగ్రీ కాలేజీలో ఘనంగా నిర్వహించారు.జనాబ్ హాజీ మీర్ అబ్బాస్ హుస్సేన్ సాహెబ్ ముఖ్య అతిథిగా హాజరై జాబ్ మేళాను ప్రారంభించగా, వినెక్స్ డిగ్రీ కాలేజ్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. శ్రీనివాస్ రావు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ప్లేస్‌మెంట్ పార్క్ సీఈఓ షారుక్, వివిధ కంపెనీల ప్రతినిధులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి ట్రస్ట్ అడ్వైజర్ జనాబ్ రాజక్ సాహెబ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డా. షేక్ ఖాదర్ బాబా మాట్లాడుతూ, గత దశాబ్దంగా యువత మరియు మహిళల సాధికారత, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ మరియు ఉపాధి కల్పనలో ట్రస్ట్ కీలక పాత్ర పోషిస్తున్నదని తెలిపారు. ప్రతి నెలా ఇటువంటి జాబ్ మేళాలు నిర్వహిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యమని చెప్పారు. ఈ జాబ్ మేళాలో ఐటీ, నాన్-ఐటీ మరియు కన్సల్టెన్సీ రంగాలకు చెందిన పలు కంపెనీలు పాల్గొన్నాయి. మొత్తం 153 మందికి పైగా అభ్యర్థులు పాల్గొనగా, 98 మంది వివిధ కంపెనీలలో ఎంపిక కావడం విశేషం. ముఖ్య అతిథి హాజీ మీర్ అబ్బాస్ హుస్సేన్ సాహెబ్ యువతకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అల్-ఇమ్దాద్ ఛారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. జాబ్ మేళా విజయవంతానికి సహకరించిన వినెక్స్ డిగ్రీ కాలేజ్ యాజమాన్యం, కంపెనీల ప్రతినిధులు మరియు నిర్వాహక బృందానికి ట్రస్ట్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో అలీ అబ్దుల్ ఖాదర్ పట్టా ఫౌండేషన్ చైర్మెన్ రమేష్ కాలేజ్ చైర్మెన్ చంద్ర శేఖర్ పాల్గొన్నారు




## మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు

**మేడికొండూరు,ఆగస్టు 8 (జయ జయహే )**

ఆరోగ్యవంతమైన వాళ్ళు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, రక్తదానం ద్వారా ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలు రక్షించబడతాయని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ షేక్ జాని రసూల్ అన్నారు.గుంటూరు జిల్లా మండల కేంద్రమైన మేడికొండూరులో కీర్తిశేషులు తలతోటి సుధీర్ బాబు జయంతిని పరిష్కరించుకొని మేరా యువ భారత్ గుంటూరు,జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ సహకారంతో తలకోటి శశి కిరణ్ మిత్రబృందం నేతృత్వంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జాని రసూల్ మాట్లాడుతూ ఒకరు రక్తం ఇవ్వడం ద్వారా ఇరువురికి ప్రాణాధారమని అనే సందేశంతో నిర్వహించిన ఈశిబిరం ద్వారా అత్యవసర సమయంలో అవసరమైన వారికి రక్తం అందించి సహకరించడములో యువతలో సామాజిక బాధ్యత,సేవాభావాన్ని పెంపొందిస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు,కోఆర్డినేటర్ షేక్ సుభాని మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఒకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం లభిస్తుందని, ఆరోగ్యవంతమైన యువతీ యువకులు స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొనాలన్నారు.ఈ రక్తదాన శిబిరంలో 18 మంది రక్తదానం చేశారు.




## మెగా డీఎస్సీ దగా డీఎస్సీ రిలే నిరాహార దీక్షకి సంఘీభావం

**అచ్చుతాపురం, ఆగస్టు 8, జయ జయహే:**

ఎలమంచిలి నియోజవర్గం అచ్చుతాపురం మండలంలో మాజీ ఎమ్మెల్యే, ఎలమంచిలి నియోజవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో జరుగుతున్న, మెగా డీఎస్సీ దగా డీఎస్సీ రిలే నిరాహార దీక్షకి సంఘీభావం తెలిపిన అనకాపల్లి పార్లమెంట్ పరిశీలికులు శోభ హైమావతి, గండి రవి కుమార్, చోడవరం నియోజకవర్గం పరిశీలికులు, రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, నిరాహార దీక్షలో ఉన్న విద్యా విభాగం, సోషల్ మీడియా విభాగం, యూవజన విభాగం నిరాహారదీక్ష చేస్తున్న వారికి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ నిమ్మరసం తాగించడం జరిగింది.

# ముగ్గురు ఎమ్మెల్యేలతో జీవీఎంసీ ఉద్యోగ సంఘ నేతలు





**- ఒకే యూనిట్..ఒకరే కమిషనర్ అంటున్న ఉద్యోగులు**

**- పోరాట వేగం పెంచిన మినిస్టీరియల్ ఉద్యోగుల**

**- ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌పై పునరాలోచించాలంటూ ఎమ్మెల్యేలతో చర్చలు**

**విశాఖపట్నం, ఆగస్టు 8, జయ జయహే :**

ప్రెసిడెన్షియల్ ఉత్తర్వుల నుంచి తమను మినహాయించాలంటూ జీవీఎంసీ మినిస్టీరియల్ ఉద్యోగులు చేపట్టిన ఉద్యమం ఊపందుకుంది. జీవీఎంసీ ఏర్పడిన చట్టంలోని సెక్షన్లను చూపిస్తూ ఉన్నతాధికారులకు ఇప్పటికే లేఖలు కుడా రాశారు. తమ సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలంటూ నేతలకు విజ్ఞప్తి చేస్తున్నారు. శనివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆశ్రయించారు. బీజేపీ ఎమ్మెల్యే, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజును కలిసి తమ సమస్యల్ని విన్నవించారు. విశాఖ జనసేన నగరాధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిసి జీవీఎంసీలోని మినిస్టీరియల్ ఉద్యోగులకు సంబంధించి అందర్నీ ఒకే యూనిట్‌గా కొనసాగించడంతో పాటు నియామక అధికారిగా కమిషనర్‌నే యధావిధిగా ఉంచాలంటూ విజ్ఞప్తి చేశారు. జీవో 135పై పునఃపరిశీలించాలని కోరారు. ఎమ్మెల్యేల్ని కలిసిన వారిలో జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వీవీ వామనరావు, గుమ్మడి నర్సింగ్, జీవీఎంసీ ఏఐటీయూసీ అధ్యక్షులు పడాల రమణ, బొట్ట ఎర్రాజీ, ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, కోశాధికారి రవి, జీవీఎంసీ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.అప్పలనాయుడు, సన్నీ, క్లాస్ ఫోర్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గణపతి, జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనుబాబు, వి. శ్రీనివాసరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## గేదెల సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ సీఎం రమేష్

**కృష్ణమ్మ నాయుడు లేని లోటు తీర్చలేనిది సీఎం రమేష్,తాతయ్య బాబు**

**బుచ్చయ్యపేట, జయ జయహే**

అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ శనివారం బుచ్చయ్యపేట మండలం కోమల్లపూడి గ్రామంలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మాజీ సర్పంచ్ గేదెల కృష్ణమ్మ నాయుడు పెద్దకర్మ కార్యక్రమానికి హాజరుకాలేకపోయిన ఎంపీ, శనివారం ఆయన నివాసానికి వెళ్లారు.కృష్ణమ్మ నాయుడు కుమారుడు గేదెల సత్యనారాయణ మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కృష్ణమ్మ నాయుడు లేని లోటు తీర్చలేనిది అని పేర్కొన్నారు. అనంతరం కృష్ణమ్మ నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలు అర్పిచి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలోని స్థానిక శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేష్‌తో పాటు,కేఎస్ఎన్ఎస్ రాజు చోడవరం ఎమ్మెల్యే, బత్తుల తాతయ్య బాబు ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, ఈర్లె శ్రీరామ్మూర్తి, బీజేపీ సీనియర్ నాయకులు, తమరాన దాసు అనకాపల్లి జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు, ఎంపీపీ సత్యనారాయణ బుచ్చయ్యపేట మండల టీడీపీ అధ్యక్షుడు, వీరితో పాటు పలువురు కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అరుణాచల్‌పై చైనా కుట్రలకు చెక్

**జయ జయహే**

భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రాంతాలను తమవిగా చెప్పుకునే చైనాకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. ఆ రాష్ట్రంలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లు, ఒక సరస్సు సహా 27 కీలక ప్రాంతాలతో కూడిన సవివరమైన ప్రామాణిక మ్యాప్‌ను సర్వే ఆఫ్ ఇండియా విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య సరిహద్దుకు సంబంధించి పూర్తి క్లారిటీతో ఈ మ్యాప్‌ను విడుదల చేసింది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తరువాత ఈ మ్యాప్‌ను ఖరారు చేసినట్టు హోంశాఖ తెలిపింది. తాజా మ్యాప్‌తో ప్రజలకు మరింత అవగాహన పెరుగుతుందని సర్వే ఆఫ్ ఇండియా చెప్పింది. మ్యాప్‌లో తాజాగా చేర్చిన 27 ప్రాంతాల్లో సరిహద్దున ఉన్న మూడు ప్రాంతాలకు (సుబన్‌సిరి జిల్లా) వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. అదే జిల్లాలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లను కూడా మ్యాప్‌లో చూపించారు.



## ఏపీ ఎస్టీ కమిటీ చైర్మన్ శిరీషను కలసిన బలిరెడ్డి

**విశాఖపట్నం, ఆగస్టు 8, జయ జయహే**

ఏపీ శాసనసభ షెడ్యూలు తెగల సంక్షేమ కమిటీ చైర్మన్ మిరియాల శిరీష దేవిని మర్యాదపూర్వకంగా కలిసిన బలిరెడ్డి విశాఖ నగరంనకు విచ్చేసిన రంపచోడవరం ఎమ్మెల్యే ఏపీ శాసనసభ షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ చైర్మన మిరియాల శిరీష దేవిని విశాఖ పార్లమెంటరీ టిఎన్ టియుసి అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి అంగన్వాడి టీచర్స్ సమస్యలపై అగనంపూడి ఏరియాలో ఆరుకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ దేశంలోనే అన్ని రాష్ట్రాల మీద ఆంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల సంక్షేమానికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. స్థానికంగా గిరిజన కార్పొరేషన్ షాపులో ఉన్నవారు అరుకు కాఫీ స్టాల్ కి దరఖాస్తు చేసుకున్నట్లయితే వారికి అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు.

## లోయలో పడ్డ బొలెరో వాహనం

**ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం**

**జయ జయహే**

ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బొలెరో వాహనం లోయలో పడ్డ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవ్‌ప్రయాగ్ నుంచి పౌరీ వెళుతున్న బొలెరో వాహనం శుక్రవారం సాయంత్రం సబ్దర్‌ఖల్ వద్ద ప్రమాదానికి గురైంది. రోడ్డు పక్క ఉన్న లోయలో పడిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే దేవ్‌ప్రయాగ్ పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బొలెరోలో ఒకే కుటుంబానికి చెందిన 7 మంది ఉన్నారు. వాహనం లోయలో పడగానే తీవ్రగాయాలపాలై ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరిని సహాయక సిబ్బంది దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

# ఉత్తరంలో ముగిసిన వైసీపీ రిలే నిరాహార దీక్షలు




**రిలే నిరాహార దీక్షలు చేపట్టిన విద్యార్థులు, యువత, నాయకులు**

**లోకేష్ రాజీనామా చేయాలనీ మానవహారం**

**విశాఖపట్నం, ఆగస్టు 8, జయ జయహే**

విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలతో పాటు డీఎస్సీ అక్రమాలపై వైసీపీ జిల్లా అధ్యక్షులు కేకే రాజు ఆధ్వర్యంలో సత్యం జంక్షన్ వద్ద గత మూడు రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం ముగిసాయి. జీవీఎంసీ 47,48,49,50 51,52,53,54,55, వార్డు నాయకుల చేపట్టిన రిలే నిరాహార దీక్షలను కేకే రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ అక్రమాలతో పాటు నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9500 కోట్లు చెల్లించాలన్న డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం ఉలిక్కిపడుతోందని చెప్పారు. శాంతియుతంగా నిరసనలు తెలుపుతుంటే కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలకు దిగుతున్నారన్నారు . ఈ ప్రభుత్వంలో ప్రశ్నించడమే నేరం అనే విధంగా అరెస్టులు, అక్రమ కేసులు పెడుతున్నారని, ఇలాంటి వాటికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భయపడదన్నారు. అధికార, పోలీస్ బలంతో తమ ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్లు పోలీసులు నడుచుకోవద్దని కోరారు. అక్రమ అరెస్టులు, కేసులు పెడితే తిరుగుబాటు వస్తుందని హెచ్చరించారు. దీక్ష చేపట్టిన అల్లుశంకర్ రావు, రేయ్యివెంకటరమణ,వావిలపల్లి ప్రసాద్ భర్కట్ ఆలీ, గుజ్జు వెంకట్ రెడ్డి, సుకుమార్,డోప్ప శ్రీను,ఐ.రవికుమార్, వేణు ధమయంతి,ఎరం శెట్టి శ్రీను,కె వి బాబా షేక్ బాబ్జి, పి. ఈశ్వరి, చందు,కోరిబిల్లి చందు, తాటిపూడి రత్నం,సొండి సురేష్, శివరాం,విమల్ లకు నిమ్మరసం ఇచ్చి కేకే రాజు మూడవ రోజు దీక్ష విరమీశప చేశారు. అనంతరం సత్యం జంక్షన్ వద్ద డీఎస్సీలో జరిగిన అక్రమాల పై లోకేష్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తు విద్యార్థులు, యువత,వైసీపీ శ్రేణులు తో కలిసి భారీగా మానవహారం చేపట్టారు.



## బీచ్ షాక్స్ జీవోను రద్దు చేయాలి

**బీచ్ షాక్స్ వ్యతిరేక పోరాట కమిటీ మానవహారం**

**మద్దిలపాలెం తెలుగు తల్లి విగ్రహం వద్ద నిరసన**

**విశాఖపట్నం, ఆగస్టు 8, జయ జయహే**

బీచ్ షాక్స్ జీవో 362 రద్దు చేయాలంటూ నగరంలోని మద్దిలపాలెం తెలుగు తల్లి విగ్రహం వద్ద శనివారం మానవహారం, ర్యాలీ జరిగింది. బీచ్ షాక్స్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్లు పిఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. లక్ష్మి, , మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విమల, జిల్లా కార్యదర్శి బేగం, ఐద్వా నాయకులు సత్యవతి, సిఎం ఎస్ నాయకులు లలిత మాట్లాడుతూ సంపద సృష్టి పేరుతో బీచ్ లో మద్యం అమ్మకాలు, షాపుల ఏర్పాట్ల నిర్ణయాన్ని ప్రజా ప్రతినిధుల వ్యాఖ్యానాలను తీవ్రంగా ఖండించారు. విశ్రాంతి వినోదం ఆధ్యాత్మికం అహ్లాదకరమైన కార్యక్రమాలకు నిలయమైన మన బీచ్ ను బీచ్ షాక్స్ పేరుతో క్యాసినోల రూపం ఎత్తనుంది. దీన్ని అడ్డుకుందాం రండి అని పిలుపునిచ్చారు. మహిళలని అక్రమ రవాణా చేస్తూ .. శారీర వ్యాపారాలు చేస్తూ గంజాయి మద్యం బెట్టింగ్ లతో వ్యాపారం చేసే గోవా తరహా అభివృద్ధి మనల్ని ఆక్రమించబోతుంది. తరిమి కొడదాం రండన్నారు. పర్యావరణ హితమైన అందమైన సహజసిద్ధమైన విశాఖ బీచ్ ను కాపాడుకునే ఉద్యమంలో అందరం చేయి చేయి కలుపుదాం అని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు, పెరుగుతున్న హింసకు మద్యం, గంజాయి ప్రధాన కారణంగా ఉందన్నారు. జీవో 362ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్. వెంకటలక్ష్మి , జిల్లా ప్రధాన కార్యదర్శి రోహిణి, ఉపాధ్యక్షురాలు బాలనాగమ్మ, కార్యదర్శి ఇందిర తదితరులు పాల్గొన్నారు. . ఈ కార్యక్రమంలో మానవహారం అనంతరం ర్యాలీ నిర్వహించారు.



## క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో ఆగస్టు 10 దేశవ్యాప్త జైల్ బరో జయప్రదం చేయండి-ప్రజా సంఘాలు

**అచ్యుతాపురం, ఆగస్టు 8, జయ జయహే:**

సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు పిలుపుమేరకు ఆగస్టు 10 జైలు బరో జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. కార్మికులు, రైతాంగం సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి మోడీ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కార్మికులకు కనీస వేతనం 31వేలు ఇవ్వాలని, కార్మిక హక్కులను హరించేస్తున్న లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులపై అదనంగా మరో 50% కలిపి మద్దతు ధరలు కల్పించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మార్పులు తెచ్చి రాంజీ పథకంగా మార్చి నోటికాడ కూడిన తీసేసిందని, స్కీం వర్కర్లకు కనీస వేతనాలు పెంచాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని తదితర డిమాండ్లతో జరిగే జైలు భరోను జయప్రదం చేయాలని కోరారు. కరపత్రాలు విడుదల చేసిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, మత్స్యకారము సంఘం జిల్లా నాయకులు చేపల తాతీయులు, సిఐటియు మండల కన్వీనర్ కూంద్రపు సోము నాయుడు, శ్రీను, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**అచ్యుతాపురం, ఆగస్టు 8, జయజయహే:**

అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ క్రీడా మైదానంలో అమరావతి ఛాంపియన్‌షిప్--2026 జిల్లాస్థాయి క్రీడా పోటీలను శాప్ చైర్మన్ రవి నాయుడు, ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ పి.బీవీఎస్ఎన్ రాజు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ, క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకువస్తాయని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో క్రీడల అభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఎమ్మెల్యే విమర్శించారు. క్రీడలకు సంబంధించిన అంశాలపై కూడా అవగాహన లేని పరిస్థితి ఉండటంతోనే ప్రజలు గత పాలకులకు తగిన సమాధానం చెప్పారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రంలో క్రీడలకు మరింత ప్రోత్సాహం లభిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి, వారికి అవసరమైన శిక్షణ, మౌలిక సదుపాయాలు కల్పించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అమరావతి ఛాంపియన్‌షిప్--2026 ద్వారా జిల్లాలోని యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాప్ డైరెక్టర్ బీవీఎస్ఎస్ రాజు, డీసీఎంఎస్ చైర్మన్ కోటిని బాలాజీ, క్రీడా శాఖ అధికారులు, టీచర్స్ ప్రజాప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాకారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com